సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
మంగళవారం, 13.10.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 343
పేజీలు: 08 వెల: రూ. 5


## సుప్రీంను లాగొద్దు

### సీజేఐ సూర్యకాంత్



- పెండింగ్ అంశాలపై రాజకీయ నేతలతో భేటీ అవసరం లేదు
- సీఈసీపై సమస్యలుంటే పిటిషన్ వేయండి: సీజేఐ
- సుప్రీంకోర్టు తలుపులు అందరికీ తెరిచే ఉంటాయి
- ఓట్ల చోరీ అంశంపై రేపు సుప్రీంలో విచారణ

02

## ఇక జంతర్ మంతర్‌లో నిరసనలు బంద్

### అనుమతి లేదన్న ఢిల్లీ పోలీసులు

- ప్రత్యామ్నాయంగా రామ్‌లీలా మైదాన్, బురారీ మైదాన్, సీబీడీ గ్రౌండ్
- కమిటీ సిఫారసుల మేరకు జంతర్ మంతర్‌ను నిర్దేశిత నిరసన స్థలాల జాబితా నుంచి తొలగింపు
- ప్రతిపక్షాలు, కాక్రోచ్ పార్టీ నిరసనల నేపథ్యంలో పోలీసుల నిర్ణయానికి ప్రాధాన్యం




02

## బారికేడ్లతో నేతలకు బ్రేక్

- రాహుల్ తరపున సుప్రీంలో పిటిషన్
- సీఈసీ రాజీనామాకు విపక్షాల పట్టు
- 'మార్చ్ ఫర్ డెమోక్రసీ'..
- సుప్రీంకోర్టు వరకు విపక్షాల మార్చ్
- భగవాన్ దాస్ రోడ్డులో ఉద్రిక్తత

### విపక్షాల మార్చ్‌ని అడ్డుకున్న పోలీసులు



**ముద్ర, డెస్క్:**
సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపిస్తూ సుప్రీంకోర్టు వరకు మార్చ్‌కు పిలుపునిచ్చింది విపక్ష ఇండియా కూటమి. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రతిపక్ష నేతలు ఈ ర్యాలీ చేపట్టారు. వీరి మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో విపక్ష ఎంపీలు, నేతలు ఈ ర్యాలీ చేపట్టారు. ఓటు చోరీ అంశంతో పాటు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు లో స్వయంగా పిటిషన్ దాఖలు చేసేందుకు రాహుల్ బృందం బయల్దేరింది. విపక్ష నేతలు ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, తేజస్వీ యాదవ్, అఖిలేశ్ యాదవ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, శశి థరూర్, సచిన్ పైలట్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు. వీరికి మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అయితే, భగవాన్ దాస్ రోడ్డు వద్ద బారికేడ్లు పెట్టి విపక్ష నేతలను నిలువరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఒకింత ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు..

మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది. రాహుల్ గాంధీ ర్యాలీలోనే ఆగిపోవడంతో న్యాయస్థానానికి రాలేకపోయారు. దీంతో ఆయన తరపున న్యాయబృందమే పిటిషన్ దాఖలు చేసింది. అంతకుముందు, 'ఓట్ల చోరీ' అంశాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వద్ద లేవనెత్తాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు తమకు సమయం ఇవ్వాలని సీజేఐని అభ్యర్థించింది. అయితే, ఇందుకు సీజేఐ తిరస్కరించారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న అంశాన్ని విపక్షాలతో చర్చిస్తే.. అది చట్టవిరుద్ధమే అవుతుందని జస్టిస్ సూర్యకాంత్ విపక్షాలకు లేఖ రాశారు.

## వాట్సాప్‌లో NO అని రిప్లయ్ ఖాతా ఖాళీ

### సీపీ సజ్జనార్



03

- సైబర్ నేరగాళ్ల సరికొత్త ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్
- ఓటీపీ, లింకులు లేకుండానే జరుగుతున్న మోసం

# సంక్షేమ సెగ

### తెలంగాణలో పరిస్థితి

### దుమ్మెత్తి పోస్తున్న ప్రతిపక్షాలు

రాజకీయాల్లో దూకుడు.. పథకాల అమలులో జాప్యం

రేవంత్ సర్కారుపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి

రైతు భరోసా నుంచి కల్యాణలక్ష్మి వరకు జాప్యమేనా?

ఆరు గ్యారెంటీల అమలుపై సవాళ్లు..

పాత పథకాలకూ నిధుల కొరత

ప్రత్యర్థులపై పైచేయి సరే.. ప్రజలకు పథకాలేవీ?



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ రాజకీయాల్లో వ్యూహాలు, ఎత్తులు, పైఎత్తులతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి.. పాలనాపరమైన సవాళ్లు మాత్రం కొత్త తలనొప్పిగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మార్పుతో మెరుగైన పాలన, సంక్షేమ పథకాల నిరంతర అమలు ఆశించిన ప్రజలకు.. లబ్ధి అందడంలో జాప్యం నిరాశ కలిగిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఆరు గ్యారెంటీల అమలుపై చర్చ కొనసాగుతుండగా, మరోవైపు రైతు భరోసా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల లబ్ధి సకాలంలో అందడం లేదనే ఆరోపణలు ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నాయి.

**సంక్షేమంపై సర్కారుకు సవాళ్లు!**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలతో పాటు, కొత్తగా ప్రకటించిన ఆరు గ్యారెంటీల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అంచనాలను అందుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పథకాల అమలులో సాంకేతిక సమస్యలు, నిధుల విడుదలలో జాప్యం వంటి అంశాలు సామాన్యులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, ఇప్పటికే కొనసాగుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులకు సకాలంలో అందించడం ప్రభుత్వానికి కీలకంగా మారింది.

**రైతు భరోసాపై రగులుతున్న అసంతృప్తి**

రైతు సంక్షేమం విషయంలో ప్రభుత్వంపై విమర్శలు మరింత ఎక్కువగా వినిపిస్తున్నాయి. గతంలో రైతుబంధు పేరుతో అమలైన పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాగా మార్చింది. సాగులో లేని భూములు, గుట్టలు తదితరాలకు పెట్టుబడి సాయం నిలిపివేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. అర్హులైన రైతులకు కూడా నిధులు ఆలస్యంగా అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వానాకాలం, యాసంగి పెట్టుబడి సాయం విషయంలో జాప్యం రైతుల్లో ఆందోళనకు కారణమవుతోందని ప్రతిపక్షాలు, రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి.

**కల్యాణలక్ష్మి.. షాదీ ముబారక్ కోసం ఎదురుచూపులు**

పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసాగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దరఖాస్తు చేసుకున్న తర్వాత నెలలు గడుస్తున్నా ఆర్థిక సాయం అందడం లేదని కొందరు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. మిగతా 02లో

## ఏసీబీ కోర్టుకు కేటీఆర్

### ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ కీలక అడుగు

- నాంపల్లి కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్!
- తన పేరు తొలగించాలంటూ పిటిషన్
- రాజకీయ కక్షసాధింపే అంటున్న కేటీఆర్
- ఫార్ములా ఈ-రేసు కేసులో ఉత్కంఠ



**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన ఫార్ములా ఈ–కార్ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరో కీలక అడుగు వేశారు. ఈ కే సులో తనను నిందితుడిగా చేర్చడాన్ని సవాల్ చేస్తూ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. అవినీ తి నిరోధక శాఖ (ఏసీబీ) సమర్పించిన ఛార్జ్ షీట్‌లో తన పేరును ఏ1 నిందితుడిగా పేర్కొనడాన్ని ఆయన తప్పుబట్టారు. తనపై వచ్చిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ, కేసు నుంచి తనను పూర్తిగా తొలగించాలని కోర్టును కోరారు. పిటిషన్‌పై న్యా యస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**ఆరోపణలకు ఆధారాలు లేవంటున్న కేటీఆర్**

ఫార్ములా ఈ–కార్ రేసు నిర్వహణలో ఎ లాంటి అవినీతి జరగలేదని కేటీఆర్ తరఫు న్యాయవాదులు తమ పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నగ రంగా నిలబెట్టడం, ప్రపంచ క్రీడా వేదికపై నగర ప్రతిష్టను పెంచడం వంటి లక్ష్యాలతోనే రేసును నిర్వహించినట్లు వాదించారు. ఈ వ్యవహారంలో కేటీఆర్ వ్యక్తిగతంగా ఎలాం టి ప్రయోజనం పొందలేదని స్పష్టం చేశారు.ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో తనను ప్ర ధాన నిందితుడిగా చేర్చడానికి తగిన ప్రాథ మిక ఆధారాలు లేవని కేటీఆర్ తరఫు న్యా యవాదులు అభ్యంతరం మిగతా 02లో

## ఢిల్లీ వదిలి వెళ్లొద్దు..

- ఆదేశాలు వచ్చే వరకు ఉండాలని స్పష్టీకరణ
- తెలంగాణ నేతలకు సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ కీలక ఆదేశాలు
- సీఈసీ నిర్ణయాలు, ఎస్ఐఆర్‌పై ఆందోళనల వేళ కీలక పరిణామం



02

## 20 కోట్ల ఓట్లు తొలగింపు టార్గెట్

### సర్‌తో ఓట్లు తొలగిస్తున్నారని సీఎం ఆరోపణ

- జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గు తాయని ప్రశ్న
- జ్ఞానేశ్ కుమార్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు
- ఢిల్లీలో ఇండీ కూటమి ధర్నాలో తెలంగాణ సీఎం ధ్వజం



02

## దొరికిందల్లా దోచుకుంటున్నారు

### రూ.600 కోట్లు తక్కువ టెండర్ వేసినా పక్కన పెట్టారు!



02

- రేవంత్ శాఖలోనే అవినీతి.. రాజగోపాల్ రెడ్డి ఫైర్
- రాహుల్ గాంధీ దృష్టికి టెండర్ల అక్రమాలు
- సొంత ప్రభుత్వంపై విమర్శలు
- అవసరమైతే సుప్రీంకు వెళ్తా
- రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి హాట్ కామెంట్స్

## ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు




02

### విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్

- ఆంధ్రప్రదేశ్‌లోని 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు
- పురపాలక శాఖ నుంచి జీవో నెం. 252 జారీ
- 5 బీసీ, 2 ఎస్సీ, 1 ఎస్టీ, 5 జనరల్ మహిళలకు కేటాయింపు
- త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

### ఇదీ AI ముద్ర



జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోండి!

అధిక ఒత్తిడి జుట్టు, గడ్డం ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి ధ్యానం, యోగా, నడక వంటి అలవాట్లను పాటించాలి. ఒత్తిడి తగ్గించడం వల్ల తెల్ల వెంట్రుకలు పూర్తిగా రాకుండా ఉంటాయని మాత్రం చెప్పలేం.




## సంక్షేమ పథకాల సెగ

(మొదటి పేజీ తరువాయి)

తొలుత పాత పథకం కింద ప్రకటించిన రూ.1,00,116 ఆర్థిక సాయాన్ని సైతం వేగంగా అందించాల్సిన అవసరం ఉందనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.



**నిధుల విడుదలలో జాప్యం?**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గతంలో పేరుకుపోయిన రుణభారం, సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన భారీ నిధులు ప్రభుత్వానికి సవాళ్లుగా మారుతున్నాయి. అయితే ఆర్థిక పరిమితులు ఏవైనా.. అర్హులైన లబ్ధిదారులకు సాయం అందించడంలో జాప్యం తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు. పథకాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాచారం, నిధుల విడుదలపై పారదర్శకమైన కార్యాచరణ అవసరమనే అభిప్రాయాలున్నాయి.

**ప్రజా సంతృప్తే ముఖ్యం!**

ప్రత్యర్థులపై రాజకీయంగా పైచేయి సాధించడం, పార్టీపై పట్టు నిలుపుకోవడం ఎంత ముఖ్యమో.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కూడా అంతే ముఖ్యమని రా జకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రభుత్వ పనితీరును ప్రజలు రాజకీయ ప్రసంగాలతో కాకుండా, తమకు అందుతున్న సంక్షేమంతోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిష్కారమవుతున్న సమస్యలతోనూ అంచనా వేస్తారు. అందుకే క్షేత్రస్థాయి పాలనపై మరింత దృష్టి సారించి, పథకాల అమలులో జాప్యాన్ని తగ్గించాలని డిమాండ్లున్నాయి.
రాజకీయ వ్యూహాల్లో దూకుడు ప్రదర్శిస్తున్న రేవంత్ రెడ్డి.. అదే వేగాన్ని సంక్షేమ పాలనలోనూ చూపించగలరా? రైతులు, పేద కుటుంబాలు ఎదురుచూస్తున్న ఆర్థిక సాయం సకాలంలో అందితేనే ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని చెప్పడంలో సందేహం లేదు.

## సుప్రీంను లాగొద్దు



**ముద్ర, న్యూఢిల్లీ :**
ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓట్ల చోరీ అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు వినతి పత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీజేఐను అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిని జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ అంశంపై సీజేఐ స్పందించారు. ఇండి కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై ఆదివారం రాత్రి కాంగ్రెస్ కీలక నేతలు ఖర్గే, రాహుల్ గాంధీలకు మెయిల్ పంపినట్లు వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓట్ల చోరీ అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు వినతి పత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీజేఐను అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిని జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ అంశంపై సీజేఐ స్పందించారు. ఇండి కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై ఆదివారం రాత్రి కాంగ్రెస్ కీలక నేతలు ఖర్గే, రాహుల్ గాంధీకి మెయిల్ పంపినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రధాన ఎన్నికల సంఘం విషయంలో వారు లేవనెత్తాలనుకున్న సమస్యలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. విచారణలో ఉన్న అంశాలపై సమావేశం కావడం అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని సీజేఐ తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాలపై రాజకీయ నేతలతో సమావేశం కావాల్సిన అవసరం లేదని భావించి, వారికి అపాయింట్‌మెంట్ నిరాకరించినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాలనకు సంబంధించిన విషయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోబోవని.. కావాలంటే కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై పిటిషన్ ద్వారానే తమను సంప్రదించవచ్చని సీజేఐ సూచించారు. సీఈసీ అంశాలకు సంబంధించిన విషయాలు రేపు(మంగళవారం) విచారణకు రానున్నాయని కూడా ఆయన పేర్కొన్నారు.
సుప్రీం కోర్టు తలుపులు ఎల్లప్పుడూ అందరి కోసం తెరిచే ఉంటాయన్నారు. అంతే కానీ కోర్టులను రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దని ప్రతిపక్షాలకు సూచించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంలో సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమావేశంలో 'నీరు–జీవన అమృతం' అనే అంశంపై సీజేఐ మాట్లాడుతూ.. కలుషిత జలాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దానివల్ల ప్రజల ఆరోగ్యాలకు భారీ ముప్పు పొంచి ఉందన్నారు.



### ఇక జంతర్ మంతర్‌లో
## నిరసనలు బంద్

**ముద్ర, న్యూఢిల్లీ :**
దేశ రాజధానిలో నిరసనలకు చిరునామాగా ఉన్న జంతర్ మంతర్ విషయంలో ఢిల్లీ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై అక్కడ నిరసనలు నిర్వహించేందుకు అనుమతిని రద్దు చేశారు. నిరసనల కోసం ప్రత్యామ్నాయంగా మూడు ప్రాంతాలను ఎంపిక చేశారు. రామ్‌లీలా మైదాన్, బురారీ మైదాన్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్‌లను నిరసన వేదికలుగా ప్రకటించారు.
ఢిల్లీ పోలీసుల స్టాండింగ్ ఆర్డర్ నంబర్ ఎల్&ఓ/48/2026 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసుల మేరకు జంతర్ మంతర్‌ను నిర్దేశిత నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించినట్లు పోలీసులు వెల్లడించారు. కొత్తగా ఎంపిక చేసిన మూడు ప్రాంతాల్లో నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించేందుకు సంబంధించిన సవరించిన మార్గదర్శకాలను విడిగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. గతంలో జారీ చేసిన 2022 ఏప్రిల్ 28 నాటి స్టాండింగ్ ఆర్డర్‌లో కొంతమేర మార్పులు చేసినట్లు పేర్కొన్నారు.
భారత ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష కూటమితో పాటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనలకు సిద్ధమైన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. పైగా ఈరోజే పోలీసులను కలిసిన సీజేపీ నేతలు.. జంతర్ మంతర్ వద్ద నిరసన ఏరోజు చేపట్టాలో పోలీసులే చెప్పాలని కోరారు. అందుకు 24 గంటల అల్టిమేటం కూడా జారీ చేశారు. ఇంతలోనే పోలీసుల నుంచి తాజా నిర్ణయం వెలువడడం గమనార్హం. జంతర్ మంతర్ పరిసరాల్లో భద్రతను పోలీసులు కొనసాగిస్తున్నారు. ఆదివారం పలు మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. కీలక కూడళ్ల వద్ద సిబ్బందిని మోహరించి, రాకపోకలను నియంత్రించారు. అనుమతి లేకుండా గుమిగూడకుండా చర్యలు చేపట్టారు.

## ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

**ముద్ర, అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్



విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో నెం. 252ను జారీ చేసింది. దీని ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు, మహిళలకు కేటాయింపులు జరిగాయి. రాష్ట్రంలోని మొత్తం 17 కార్పొరేషన్లలో 5 స్థానాలను బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీకి కేటాయించారు. మరో 5 కార్పొరేషన్లను జనరల్ కేటగిరీ మహిళలకు రిజర్వ్ చేయగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా (రిజర్వేషన్ లేనివి) ప్రకటించారు. ఈ రిజర్వేషన్ల ఖరారుతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుందని భావిస్తున్నారు.

**రిజర్వేషన్ల కేటాయింపు ఇలా ఉంది**

ఎస్టీ (ఒకటి): మంగళగిరి–తాడేపల్లి
ఎస్సీ (రెండు): రాజమహేంద్రవరం, కర్నూలు
బీసీ – మహిళ (రెండు): మచిలీపట్నం, కాకినాడ
బీసీ – జనరల్ (మూడు): అనంతపురం, చిత్తూరు, ఏలూరు
జనరల్ – మహిళ (ఐదు): విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖపట్నం
అన్‌రిజర్వ్‌డ్ (నాలుగు): తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

ఈ నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. మేయర్ పదవుల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## దొరికిందల్లా దోచుకుంటున్నారు

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (HGCL) ఆధ్వర్యంలో రూ.3,296 కోట్ల విలువైన రేడియల్ రోడ్–2 నిర్మాణ టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలోనే ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఈ ప్రాజెక్టులోని మూడు ప్యాకేజీలకు సంబంధించి తమ కంపెనీ ఇతర సంస్థల కంటే రూ.600 కోట్లు తక్కువకు టెండర్లు వేసినా, తమను పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు. నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు ఇవ్వని ప్రభుత్వం.. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, ఆ డబ్బు ఇతర రాష్ట్రాల కాంట్రాక్టర్లకు కేటాయిస్తుందని నిలదీశారు. తెలంగాణ ప్రజల సొమ్ముకు నష్టం కలిగించేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ టెండర్లలో పాల్గొనవద్దంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా ఫోన్లు వచ్చాయని ఆయన వెల్లడించారు. అయినప్పటికీ తాము టెండర్లు దాఖలు చేశామని చెప్పారు. తమ కంపెనీని డిస్క్వాలిఫై చేయడానికి కారణమైన అధికారులెవరని ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని, అవసరమైతే హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. తెలంగాణలో మూడేళ్లుగా అవినీతి పేరుకుపోయిందని, సింగరేణి కూడా సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటోందని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ అవినీతిపై పోరాడతానని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి చేసినా, మరెవరైనా తప్పు చేస్తే తప్పేనని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేతలు చేపట్టిన మార్చ్‌కు తాను దూరంగా ఉండటంపై స్పందిస్తూ.. రాష్ట్రంలోనే ఇలాంటి పరిణామాలు జరుగుతుంటే ర్యాలీలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. ఈ టెండర్ల వ్యవహారాన్ని వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

### 20 కోట్ల ఓట్లు
## తొలగింపు టార్గెట్



**ముద్ర, హైదరాబాద్ :**
రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఓటు హక్కు కల్పించడానికి ఎస్ఐఆర్ చేపట్టారని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల ఓట్లను తొలగించడానికే దీనిని వినియోగిస్తున్నారని ఆరోపించారు. దిల్లీలో సీఎం మీడియాతో మాట్లాడారు. 'మోదీ తన అధికారం నిలబెట్టుకునేందుకు గతంలో ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్‌ట్యాక్స్ విభాగాలను వాడుకున్నారు. ఇప్పుడు వాటితో పని జరగడం లేదని.. ఎన్నికల కమిషన్‌ను వినియోగించుకుంటున్నారు. బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగించేందుకు ప్రస్తుతం SIRను తెచ్చారు. తమ వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు టాస్క్ ఇచ్చారు. ప్రధానంగా భాజపాను వ్యతిరేకించేది.. యువత, నిరుద్యోగులు, పేదలు. వీరి ఓట్లను తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్ చూస్తున్నారు. సీఈసీలో తప్పులు జరిగాయని మిగతా ఇద్దరు ఈసీలు వ్యతిరేకించారు. జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని తేలింది. అలాంటి అధికారిని తొలగించేందుకు మోదీకి అభ్యంతరం ఏమిటి?'
"సర్ ప్రక్రియ జరగని రాష్ట్రాల్లో భాజపా ఓడిపోయింది. ఈ ప్రక్రియ జరిగిన బిహార్, బెంగాల్‌లో భాజపా గెలిచింది. దేశంలో జనాభా పెరుగుతుంటే ఓటర్ల సంఖ్య కూడా పెరగాలి కదా.. మరి ఎందుకు తగ్గింది?" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

## ఏసీబీ కోర్టుకు కేటీఆర్



(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే తనపై కేసు నమోదు చేశారనే వాదనను కూడా పిటిషన్‌లో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తనపై మోపిన అభియోగాలు చట్టపరంగా నిలబడవని పేర్కొంటూ, కేసు నుంచి డిశ్చార్జ్ చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

**అసలు ఏమిటీ ఈ-రేసు కేసు?**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో ఫార్ములా ఈ–కార్ రేసును నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ఈ మోటార్ స్పోర్ట్స్ ఈవెంట్‌ను నగరంలో నిర్వహించడం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అయితే, ఈ రేసు నిర్వహణకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, నిధుల కేటాయింపులు వివాదానికి కారణమయ్యాయి. ఈ వ్యవహారంలో సుమారు రూ.55 కోట్ల మేర ఆర్థిక అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. నిధుల చెల్లింపులు, ప్రభుత్వ నిర్ణయాలు, సంబంధిత అధికారుల పాత్ర వంటి అంశాలపై విచారణ కొనసాగించింది. అనంతరం దర్యాప్తులో భాగంగా ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తూ కేటీఆర్‌తో పాటు పలువురు అధికారుల పేర్లను అందులో చేర్చినట్లు వెల్లడైంది.

**కోర్టు నిర్ణయంపై ఉత్కంఠ**

తాజాగా కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేయడంతో ఈ కేసు మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవైపు తనపై వచ్చిన ఆరోపణలను కేటీఆర్ ఖండిస్తుండగా, మరోవైపు ఏసీబీ దర్యాప్తు, ఛార్జ్‌షీట్‌లోని అంశాలు ఈ కేసులో కీలకంగా మారాయి. డిశ్చార్జ్ పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టి, ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కేటీఆర్‌ను ఈ కేసు నుంచి తప్పిస్తారా? లేక విచారణను ఎదుర్కోవాల్సి వస్తుందా? అన్నది కోర్టు నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. అయితే, పిటిషన్ దాఖలు చేసినంత మాత్రాన కేసు నుంచి విముక్తి లభించినట్లు కాదు. న్యాయస్థానం తుది నిర్ణయం వెలువడే వరకు ఈ వ్యవహారంలో తదుపరి పరిణామాలపై ఉత్కంఠ కొనసాగనుంది.

## ఢిల్లీ వదిలి వెళ్లొద్దు..

**ముద్ర, ఢిల్లీ:**
తెలంగాణ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. తాము చెప్పేంత వరకు దిల్లీ వదిలి వెళ్లొద్దని నేతలకు స్పష్టం చేశారు. సీఈసీ నిర్ణయాలు, సర్ అంశాలపై ఇండియా కూటమి నేతలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పెద్దసంఖ్యలో దిల్లీకి తరలివెళ్లారు. మరోవైపు సోమవారం నిర్వహించిన ఇండియా కూటమి ర్యాలీలో లాఠీఛార్జ్, తొక్కిసలాట చోటు చేసుకుంది. పలువురు తెలంగాణ నేతలు కిందపడటంతో స్వల్ప గాయాలయ్యాయి.



## కండక్టర్‌గా ఉన్నప్పుడే ఎక్కువ ఆనందంగా ఉండేవాణ్ని

### సూపర్ స్టార్ రజనీకాంత్

**ముద్ర, డెస్క్:**
బస్సు కండక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి, ఆ తర్వాత నటుడిగా మారారు రజనీకాంత్ . దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తూ సూపర్ స్టార్‌గా ఎదిగారు. రజనీకాంత్‌లో అభిమానులకు నచ్చేది తన నటన మాత్రమే కాదు, ఎంత ఎత్తుకు ఎదిగినా వినయంతో ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వం. ఎన్నో సందర్భాల్లో తన జీవిత ప్రయాణం గురించి మాట్లాడిన ఆయన, తాజాగా మరోసారి బెంగళూరులో బస్సు కండక్టర్‌గా చేసినప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం నటుడిగా అగ్రస్థాయిలో ఉన్నప్పటికీ, కండక్టర్‌గా పనిచేసినప్పుడే ఎక్కువ సంతోషంగా ఉండేవాడినని తెలిపారు.
'జైలర్ 2' ప్రచార కార్యక్రమంలో చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ, రజనీకాంత్‌లోని వినయం గురించి ప్రస్తావించారు. దీనికి రజనీ స్పందిస్తూ తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. "నేను స్టార్‌ను అయినప్పటికీ నాకు నటనంటే ఇష్టం. అయితే అంతకంటే బస్సు కండక్టర్‌గా పనిచేయడమే ఇంకా ఇష్టం. నేను అయిదేళ్ల పాటు కండక్టర్‌గా పనిచేశాను. ఇప్పటికీ ఆ ఉద్యోగాన్ని మిస్ అవుతుంటాను. నేను తరచూ బెంగళూరు వెళ్లేది కూడా అందుకే. నన్ను నేను ఎప్పుడూ ఓ స్టార్‌గా భావించలేదు. ఇప్పటికీ బస్సు కండక్టర్‌గానే భావిస్తుంటాను. అలాంటప్పుడు, నాలాంటి ఓ బస్సు కండక్టర్ మీలాంటి పెద్ద వ్యక్తి ముందు ఎలా ప్రవర్తిస్తారు చెప్పండి?' అని రజనీకాంత్ అన్నారు. ఈ వ్యాఖ్యలతో ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో మరో సారి అర్థమైందని అభిమానులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా, 'జైలర్'కు సీక్వెల్‌గా తెరకెక్కిన 'జైలర్ 2' అక్టోబరు 15న విడుదల కానుంది.



## నిద్ర విషయంలో నిర్లక్ష్యం వద్దు!

ప్రతిరోజూ తగినంత నిద్రపోవడం శరీర ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం. నిద్రలేమి వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. క్రమబద్ధమైన నిద్ర సమయాలను పాటిస్తూ, రోజుకు సుమారు 7–9 గంటలు నిద్రపోవడం పెద్దలకు ఉపయోగకరంగా ఉంటుంది.



## తెలంగాణలో ఫుట్‌బాల్ అభివృద్ధికి ఎల్‌ఎఫ్‌సీ ఫౌండేషన్‌తో భాగస్వామ్యం



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలో కమ్యూనిటీ ఫుట్ బాల్ ను విస్తరించి, యువ క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (SATG) కీలక అడుగు వేసింది. లివర్ పూల్ ఫుట్ బాల్ క్లబ్ ఫౌండేషన్ (LFC Foundation) హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ కోలిన్ కాంటిని సోమవారం గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఫుట్ బాల్ అభివృద్ధిపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్ పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భారత మాజీ అంతర్జాతీయ ఫుట్ బాల్ క్రీడాకారులు విక్టర్ అమల్రాజ్, షబ్బీర్ అలీతో పాటు వివిధ క్లబ్ లు, ఫౌండేషన్లు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**క్రీడలతో సామాజిక అభివృద్ధి**

ఎల్ ఎఫ్ సీ ఫౌండేషన్ అంతర్జాతీయంగా చేపడుతున్న క్రీడా, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను కోలిన్ కాంటిని వివరించారు. ఫుట్ బాల్ ద్వారా పిల్లలు, యువతలో శారీరక దృఢత్వంతో పాటు విద్య, జీవిత నైపుణ్యాలు, సామాజిక బాధ్యతను పెంపొందించవచ్చని తెలిపారు.

తెలంగాణలో వెనుకబడిన ప్రాంతాల చిన్నారులకు ఫుట్ బాల్ అవకాశాలు కల్పించడం, మహిళలు, బాలికల భాగస్వామ్యాన్ని పెంచడం, కోచ్ లకు శిక్షణ ఇవ్వడం, కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధులను క్రీడాభివృద్ధికి వినియోగించడం వంటి అంశాలపై చర్చించారు.

తెలంగాణలో ఫుట్ బాల్ అభివృద్ధికి SATG చేస్తున్న కృషిని కోలిన్ కాంటిని అభినందించారు. రాష్ట్రంలో కమ్యూనిటీ ఫుట్ బాల్, సామాజిక సమ్మిళితత్వం వంటి రంగాల్లో కలిసి పనిచేసే అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేశారు.

ఎల్ ఎఫ్ సీ ఫౌండేషన్ తో భవిష్యత్తులో భాగస్వామ్య కార్యక్రమాలను రూపొందించి, రాష్ట్రవ్యాప్తంగా ఫుట్ బాల్ ను విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీ జి. పల్గుణ, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, డాక్టర్ రవి తేజ, శ్రీనివాస్, అశోక్, జీఎంసీ బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, ప్రజా సంబంధాల అధికారి శ్ సురేష్ కాలేరు సమావేశంలో పాల్గొన్నారు.

## బాలా త్రిపురసుందరిగా భక్తులకు నిమిషాంబికా దేవి

**భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారు**



**బోడుప్పల్, ముద్ర:** శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బోడుప్పల్‌లోని శ్రీ మాతా నిమిషాంబికా దేవి అమ్మవారు బాలా త్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. దివ్య తేజస్సుతో వెలుగొందుతున్న అమ్మవారిని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా, కోరిన వరాలనొసగే కరుణామయిగా నిమిషాంబికా దేవి విరాజిల్లుతున్నారు. అమ్మవారికి 16 ప్రదక్షిణలు చేస్తే కష్టాలు తొలగి, సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సకల చరాచర జగత్తుకు మూలశక్తిగా, భక్తులను కంటికి రెప్పలా కాపాడే కన్నతల్లిగా అమ్మవారిని భక్తులు కొలుస్తున్నారు.హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానము, హంపీ పీఠం ఆధ్వర్యంలో శ్రీ మాతా నిమిషాంబికా దేవి ట్రస్ట్ నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారు రోజుకో విశిష్ట అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.'అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే.. అమ్మ కటాక్షం ఉంటే అడుగడుగునా విజయమే' అనే విశ్వాసంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతున్నారు.

## తిరుపతి అభివృద్ధికి రూ.3,222 కోట్ల పనులకు శ్రీకారం



**ముద్ర, అమరావతి:** తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) పరిధిలో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్‌గా ఈ పనులకు శంకుస్థాపన చేశారు. అలిపిరి వద్ద రూ.1,332 కోట్లతో భక్తుల కోసం వసతి సముదాయాలు, రూ.160 కోట్లతో అన్నప్రసాద కేంద్రం, రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మించనున్నారు. అలాగే 4,500 వాహనాలు నిలిపేలా రూ.311 కోట్లతో బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ ఏర్పాటు చేయనున్నారు. టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధి, తిరుపతిలో రూ.242 కోట్లతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భక్తులకు అవసరమైన వసతి, అన్నప్రసాదం, రవాణా, పార్కింగ్ సౌకర్యాలను మెరుగుపరచడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా భక్తులకు సమాచారం అందించేందుకు వెంకటాద్రి యాప్‌ను సీఎం ఆవిష్కరించారు.

# వాట్సాప్‌లో 'NO' అని రిప్లై ఇస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ

**ఇది సైబర్ నేరగాళ్ల సరికొత్త ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్**
**ఓటీపీ, లింకులు లేకుండానే జరుగుతున్న మోసం**
**గుర్తుతెలియని నంబర్లను బ్లాక్ చేయాలని సూచించిన సజ్జనార్**
**మోసపోతే 1930కి కాల్ చేయాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి**



**ముద్ర, హైదరాబాద్ :** ఓటీపీ చెప్పాల్సిన పనిలేదు, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయక్కర్లేదు.. కేవలం 'NO' అని రెండక్షరాల సమాధానం ఇస్తే చాలు.. మీ బ్యాంక్ ఖాతాలోని సొమ్ము క్షణాల్లో మాయం! సాంకేతికతను వాడుకుని సైబర్ నేరగాళ్లు పన్నిన ఈ సరికొత్త పన్నాగం ఇప్పుడు పెను సవాలుగా మారింది. 'ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్'గా పిలుస్తున్న ఈ ప్రమాదకరమైన మోసంపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఈ మోసం ఎలా పనిచేస్తుందో, దాని నుంచి ఎలా రక్షించుకోవాలో ఆయన సమగ్రంగా వివరించారు.

**మోసం ఎలా జరుగుతుందంటే..**

సైబర్ కేటుగాళ్లు పక్కా ప్రణాళికతో ఈ మోసానికి పాల్పడుతున్నారు. ముందుగా, గుర్తుతెలియని వాట్సాప్ నంబర్ నుంచి మీ ఫోన్‌కు ఒక సందేశం వస్తుంది. 'మీ బ్యాంక్ ఖాతా నుంచి ఇంత మొత్తం డెబిట్ అయ్యింది' అని ఆ మెసేజ్‌లో ఉంటుంది. అది చూసిన వెంటనే ఎవరైనా కంగారుపడటం సహజం. ఆ కంగారును ఆసరాగా చేసుకుని, వెంటనే మరో సందేశం పంపుతారు. 'ఈ లావాదేవీ మీరు చేయకపోతే, వెంటనే NO అని రిప్లై ఇవ్వండి' అని అందులో సూచిస్తారు. ఖాతాలో డబ్బులు పోయాయన్న ఆందోళనతో చాలామంది ఆలోచించకుండా 'NO' అని టైప్ చేసి పంపేస్తారు.

అక్కడే అసలు మోసం దాగి ఉంది. మీరు 'NO' అని సమాధానం పంపిన మరుక్షణమే, ఆ సందేశంలో కంటికి కనిపించకుండా దాగి ఉన్న మాల్‌వేర్ స్క్రిప్ట్స్ లేదా ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్స్ యాక్టివేట్ అవుతాయి. ఈ ఫైల్స్ హ్యాకర్లకు మీ మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణను (రిమోట్ యాక్సెస్) అందిస్తాయి. దీంతో వారు మీ ఫోన్‌లోని బ్యాంకింగ్ యాప్‌లు, పాస్‌వర్డ్‌లు, ఇతర సున్నితమైన సమాచారాన్ని సులభంగా దొంగిలించి, క్షణాల్లో మీ బ్యాంక్ ఖాతాను పూర్తిగా ఖాళీ చేస్తారు. ఇటీవల ఓ చార్టర్డ్ అకౌంటెంట్ సైతం ఈ మోసం బారిన పడి భారీగా నష్టపోయిన ఘటన ఈ దాడి తీవ్రతకు అద్దం పడుతోంది.

**ప్రజలకు సజ్జనార్ కీలక సూచనలు**

ఈ ప్రమాదకరమైన మోసం నుంచి ప్రజలు తమను తాము కాపాడుకోవడానికి వీసీ సజ్జనార్ పలు కీలక సూచనలు చేశారు.గుర్తుతెలియని నంబర్ల నుంచి బ్యాంక్ లావాదేవీల పేరుతో వచ్చే సందేశాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ 'YES' లేదా 'NO' అని రిప్లై ఇవ్వకూడదు. అలాంటి సందేశాలు రాగానే కంగారు పడకుండా, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి, చాట్‌ను పూర్తిగా డిలీట్ చేయాలి. నిజంగా మీ ఖాతా నుంచి డబ్బు కట్ అయిందో లేదో తెలుసుకోవడానికి మీ బ్యాంక్ అధికారిక మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెక్ చేసుకోవాలి.

వాట్సాప్ సందేశాలను అస్సలు నమ్మవద్దు. ఏ అధికారిక బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ కూడా వాట్సాప్ ద్వారా ఇలాంటి లావాదేవీల ధ్రువీకరణ కోరదని గుర్తుంచుకోవాలి.

**మోసపోతే ఏం చేయాలి?**

ఒకవేళ పొరపాటున ఎవరైనా ఈ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'గోల్డెన్ అవర్'లో స్పందించాలని సజ్జనార్ సూచించారు. వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ '1930'కి కాల్ చేయాలి. లేదా cybercrime.gov.in వెబ్ సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే, దొంగిలించబడిన డబ్బును ఫ్రీజ్ చేసి తిరిగి రాబట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన వివరించారు. కంగారులో ఇచ్చే ఒక్క సమాధానం జీవితకాల సంపాదనను హరించివేయగలదని, కాబట్టి ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రియాద్ విమానాశ్రయంపై క్షిపణిదాడి.. కామారెడ్డి వాసికి తీవ్ర గాయాలు

**ముద్ర న్యూస్, కామారెడ్డి :** సౌదీ అరేబియాలోని రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం జరిగిన క్షిపణి దాడుల్లో కామారెడ్డికి చెందిన 36 ఏళ్ల షేక్ సయిద్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. రియాద్‌లోని కింగ్ ఫహద్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. కామారెడ్డిలోని సైనీ బాబా కాలనీకి చెందిన షేక్ సయిద్ సుమారు 12 ఏళ్లుగా సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. కొన్నేళ్లుగా రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని స్టార్‌బక్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దాడిలో 13 మందికిపైగా మృతి చెందగా.. దాదాపు 300 మందికి గాయాలైనట్లు తెలుస్తోంది.

# ఎల్-నినో ఎఫెక్ట్.. వరి సాగుకు దూరంగా ఉండండి!



ముద్ర, హైదరాబాద్: ఎల్–నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని తెలంగాణ ప్రభుత్వం రైతులకు సూచించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు.

రానున్న నెలల్లో నీటి కొరత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీరు, పశువుల అవసరాలకే వినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ రబీ సీజన్‌లో వరి, పత్తి పంటలకు దూరంగా ఉండి, తక్కువ నీటితో తక్కువ సమయంలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పెసర, మినుము, శనగ, వేరుశనగతో పాటు పొద్దుతిరుగుడు, నువ్వులు, కుసుమ వంటి ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు.

రాష్ట్రంలో గత ఏడాదితో పోలిస్తే నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. రానున్న పది నెలల పాటు తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇస్తామని, ఎల్–నినో పరిస్థితులను పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక వార్ రూమ్‌లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పశువులకు నీరు, పశుగ్రాసం అందించేందుకు కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

మరోవైపు, భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో బిందు సేద్యం, తక్కువ నీటితో పండే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని అధికారులు సూచించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ -మెట్రో కామన్ పాస్ ఛార్జీల పునఃపరిశీలన

**-మంత్రి పొన్నం ప్రభాకర్**
**- ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఛార్జీల సమీక్షకు ప్రభుత్వం నిర్ణయం**
**- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం**



**ముద్ర, హైదరాబాద్:** ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను, వాస్తవ పరిస్థితులను సమీక్షిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం అమల్లోకి తీసుకొచ్చిన కామన్ పాస్ ధరలు రోజువారీ పాస్‌కు రూ.400 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100గా ఉంది. అదేవిధంగా నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.7,000, ఆర్టీసీ వాటా రూ.1,500గా నిర్ణయించారు.

అయితే ఈ ఛార్జీలు సామాన్య ప్రజలకు భారంగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు ఛార్జీలను పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ధరలను నిర్ణయించే అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్టీసీ, మెట్రో సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకునేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా, వారి అవసరాలకు అనుగుణంగా, సౌకర్యవంతమైన ధరలతో కామన్ పాస్ విధానం అమలయ్యేలా తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రజా రవాణాను మరింత అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

# తెలంగాణ–జపాన్ మధ్య నైపుణ్య, ఉపాధి బంధం బలోపేతం

**- ఐదేండ్లలో 45 లక్షల మందికి నైపుణ్య శిక్షణ..**
**- ప్రపంచ పారిశ్రామిక రంగానికి తెలంగాణ యువతను సిద్ధం చేస్తాం**
**- హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి**

ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 12: తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతోందని శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఇందులో భాగంగా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమల్లో ఉపాధి పొందేలా ఐదేండ్లలో దాదాపు 45 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.

సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్ ప్రభుత్వ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభోపన్యాసం చేశారు.

హిరోషిమా పర్యటన సందర్భంగా చర్చించిన అంశాలను ప్రస్తావిస్తూ.. తెలంగాణ, హిరోషిమా మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

జపాన్‌లోని పారిశ్రామిక సంస్థల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను సిద్ధం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా జపనీస్ భాషా శిక్షణ కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. భాషపై అవగాహనతో పాటు జపాన్ పరిశ్రమల్లో పనిచేసేందుకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించడమే లక్ష్యమన్నారు.

జపాన్ పారిశ్రామిక రంగంలో పాటించే కచ్చితత్వం, క్రమశిక్షణ, పనిపట్ల అంకితభావం వంటి విలువలను తెలంగాణ యువతలో పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని వివేక్ వెంకటస్వామి తెలిపారు.

సాంకేతిక నైపుణ్యాలతో పాటు అక్కడి పని సంస్కృతిని అర్థం చేసుకోవడం ద్వారా జపాన్‌లో ఉపాధి అవకాశాలను యువత మరింత సమర్థంగా అందిపుచ్చుకోగలదని అన్నారు.హిరోషిమా ప్రభుత్వంతో చర్చల ద్వారా నైపుణ్య మానవ వనరుల మార్పిడి, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ, అంతర్జాతీయ ఉపాధి అవకాశాల విస్తరణకు మరిన్ని మార్గాలు అన్వేషిస్తామని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
మంగళవారం, 13 అక్టోబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

# పల్లీలు తిన్నాక నీరు తాగొచ్చా?

పల్లీలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అంతేకాకుండా ఆరోగ్య సమస్యల్ని కూడా దూరం చేస్తాయి. వీటిని తినడం వల్ల బ్లడ్ ప్రెజర్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. దీనికి కారణం పల్లీల్లోని మెగ్నీషియం, పొటాషియం వంటి మినరల్స్. వీటి వల్ల బ్లడ్ ప్రెజర్ మెరుగ్గా మారుతుంది. అంతేకాకుండా, పల్లీల్లోని ఫైబర్, ఫ్యాట్, ప్రోటీన్ వంటి పోషకాలు ఉండడం వల్ల కడుపు నిండుగా ఉంటుంది. దీని వల్ల ఎక్కువ సేపు ఆకలి అవ్వదు. పీనట్స్‌లో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. అంటే తినగానే వెంటనే బ్లడ్ షుగర్, టైప్ 2 డయాబెటీస్ వంటి సమస్యలు పెరగవు. ఇన్ని లాభాలున్న పల్లీలను తింటే ఏమైనా సమస్యలు వస్తాయా అంటే కొన్ని సందర్భాల్లో అలర్జీలు వస్తాయి. అంతేకాదు, పల్లీలు తిని నీరు తాగినా సమస్యలొస్తాయని చెబుతారు. ఇందులో నిజమెంతో డాక్టర్ ఎడ్విన్ రాజ్(హెడ్ ఆఫ్ సర్వీసెస్, క్లినికల్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, ఆస్టర్ CMI హాస్పిటల్, బెంగళూరు) చెబుతున్నారు.

**పల్లీలు తిన్నాక నీరు తాగితే**

పల్లీలు తిన్న వెంటనే నీరు తాగితే హానికరమని, ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పడానికి బలమైన ఆధారాలు లేవని, ఇది ఓ నమ్మకం మాత్రమేనని డాక్టర్ చెబుతున్నారు. పల్లీలు తిన్నాక జీర్ణక్రియకి ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే, పల్లీల్లో ప్రోటీన్, హెల్దీ ఫ్యాట్స్, ఫైబర్‌లు ఉంటాయి. దీంతో తినగానే కడుపు నిండుతుంది. తేలిక పాటి స్నాక్స్‌తో పోలిస్తే పల్లీలు జీర్ణమవ్వడానికి ఎక్కువ టైమ్ పడుతుంది. వీటిని తినగానే నీరు తాగితే బాడీ హైడ్రేట్ అవుతుంది. అంతేకానీ, జీర్ణ వ్యవస్థకి ఎలాంటి నష్టం జరగదని చెబుతున్నారు.

**దగ్గు లేదా జలుబు**

పల్లీలు తినగానే వెంటనే నీరు తాగితే దగ్గు, జలుబు అవుతుందని అంటారు. కానీ దీనికి కూడా తగినన్నీ ఆధారాలు లేవని డాక్టర్ చెబుతున్నారు. కొన్నిసార్లు అది అలర్జీ వల్ల కూడా రావొచ్చని చెబుతున్నారు. పల్లీలలో వేడి చేసే గుణం కారణంగా తిన్న వెంటనే నీరు తాగితే బాడీ లోపల అసమతుల్యత ఏర్పడి ఈ సమస్య వస్తుందనడానికి తగిన ఆధారాలు లేవు.

**జీర్ణ సమస్యలు**

పల్లీలు తిని వెంటనే నీరు తాగితే అవి జీర్ణమవ్వడానికి ఇబ్బంది ఏర్పడుతుంది. దీంతో గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలొస్తాయి. కడుపు లోపల అవి అరగడానికి ఎక్కువ టైమ్ పడుతుంది. అందుకే, వీటిని తిని వెంటనే నీరు తాగకపోవడం మంచిదని కొందరు చెబుతుండగా, మరికొంతమంది మాత్రం నీరు తాగితే జీర్ణక్రియకి హెల్ప్ అవుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఇది మనం తీసుకునే పల్లీల పరిమాణం, వ్యక్తిగత జీర్ణక్రియ పనితీరుని బట్టి ఉంటుంది. ఎక్కువగా పల్లీలు తినడం, తిన్నాక ఎక్కువగా నీరు తాగితే సమస్య వస్తుంది. కాబట్టి, తగిన పరిమాణంలో తీసుకుని తర్వాత నీరు తాగడం మంచిది.

**అలర్జీలు**

సాధారణంగానే పల్లీలు అంటే కొంతమందికి అలర్జీ ఉంటుంది. వీటిని తినగానే దురద, వాపు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులొస్తాయి. అలాంటప్పుడు పల్లీలని తినకపోవడమే మంచిది. ఎందుకంటే ఇది తీవ్ర సమస్యలకి దారితీస్తుంది. పల్లీలు మాత్రమే కాకుండా, చట్నీలు, పల్లీలతో తయారైన ఏ పదార్థాలనైనా అవాయిడ్ చేయడమే మంచిది.

**ఏం చేయాలి?**

పల్లీలు తినగానే నీరు తాగడం అనేది అందరికీ చెడు చేస్తుందనడానికి ఆధారాలు లేవు. కొంతమందికి పడకపోవడానికి కారణాలు ఉంటాయి. అలాంటివారు వెటనే నీరు తాగకుండా కొద్దికొద్దిగా సిప్ చేస్తూ తాగాలి. అంతేకాకుండా, ఆ నీరు కూడా మరీ చల్లగా కాకుండా రూమ్ టెంపరేచర్‌లో ఉన్న నీటిని తాగం మంచిది. మీకు పల్లీలలంటే అలర్జీ ఉంటే ముందుగానే డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది.



# జుట్టు రాలడం నివారించే చిట్కాలు

జుట్టు ఒత్తుగా, మెరుస్తూ, ఆరోగ్యంగా కనిపించాలని ఎవరు మాత్రం కోరుకోరు? జుట్టు కోసం షాంపూ, ఆయిల్, హెయిర్ మాస్క్ ఇలా ఎన్నో రకాల ప్రొడక్ట్స్ ఉపయోగిస్తుంటారు. అయినా జుట్టు రాలడం మొదలైతేమాత్రం ఏం చేయాలో అర్థం కాక వెంటనే ఖరీదైన హెయిర్ కేర్ ప్రొడక్ట్స్ కోసం వెతుకుతుంటాం. కానీ మన వంటింట్లోనే ఉండే కొన్ని పదార్థాలతో జుట్టు సంరక్షణ చేసుకోవచ్చని ఐజేఎన్ఎస్ అధ్యయనం పేర్కొంది. అలాంటి వాటిలో ఇప్పుడు కొత్తిమీర నీరు కూడా చేరింది.

వంటల్లో రుచి, వాసన కోసం ఉపయోగించే కొత్తిమీర ఆకులతో తయారు చేసిన నీటిని స్కాల్ప్, జుట్టు కోసం ఉపయోగించవచ్చని సోషల్ మీడియాలో కొన్ని వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. తో కొత్తిమీర నీటిని జుట్టుకు ఎలా ఉపయోగించాలి? ఇది నిజంగా హెయిర్ గ్రోత్‌కు ఉపయోగపడుతుందా? మరి కొత్తిమీర నీటి విషయంలో ఉన్న వాస్తవం ఏంటి? వివరాలను ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.

**కొత్తిమీర నీరు మేలు చేస్తుందా?**

కొత్తిమీరలో విటమిన్–A,C,K, ఐరన్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కుదుళ్లకు కావలసిన పోషకాలను అందించి జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి. ధనియా వాటర్ మాడుపై పేరుకుపోయిన మురికి, అదనపు నూనె, జిడ్డును తొలగించి చుండ్రు రాకుండా కాపాడుతుంది. మాడుపై రక్తప్రసరణను పెంచి కొత్త జుట్టు ఒత్తుగా, బలంగా పెరిగేందుకు సహాయపడుతుంది. రసాయనాలు ఉన్న సీరమ్‌లకు బదులుగా దీనిని వాడటం వల్ల జుట్టు మృదువుగా, మెరుస్తూ కనిపిస్తుంది.

**కొత్తిమీర వాటర్ ఎలా తయారుచేయాలి?**

ఒక కట్ట కొత్తిమీరను శుభ్రంగా కడిగి దుమ్ము లేకుండా చేసుకోవాలి. ఆకులను ఒక కప్పు నీటితో కలిసి బ్లెండర్‌లో పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని వడకట్టి మిగిలిన నీటిని కలిపి పలచన చేసుకోవాలి. సులువుగా వాడటానికి ఈ నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసుకోవచ్చు.

# ప్రకృతి హెచ్చరిక

## అప్రమత్తం అవుదాం!

**ప్రతి నీటి చుక్క విలువైనదే, డేటా సెంటర్ల నీటి అవసరాలపైనా ముందుచూపు అవసరమే**

కేప్‌టౌన్‌లో తలెత్తిన తీవ్రమైన నీటి సంక్షోభం, మహారాష్ట్రలోని లాతూర్‌కు రైళ్ల ద్వారా నీటిని తరలించిన పరిస్థితులు మనకు ఇచ్చిన హెచ్చరిక ఒక్కటే, నీరు లేని అభివృద్ధికి అర్థం లేదు. హైదరాబాద్ జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గుతున్నాయన్న వార్తలు, భూగర్భ జలాలు అడుగంటుతున్న వాస్తవాలు మనల్ని అప్రమత్తం చేయాలి. వర్షాలు తగ్గినప్పుడు, అవసరానికి సరిపడా నీరు అందుబాటులో లేనప్పుడు, నిన్నటి నిర్లక్ష్యమే రేపటి సంక్షోభంగా మారుతుంది.



**సమస్యకు కారకులం మనమే**

చెరువులను పూడ్చి భవనాలు నిర్మించడం, అడవులను నరికివేయడం, వర్షపు నీరు భూమిలోకి ఇంకే మార్గాలను మూసివేయడం, నీటిని విచ్చలవిడిగా వాడటం, ఇవన్నీ జల సంక్షోభానికి కారణాలే. కుళాయి తిప్పితే నీరు వస్తుందనే నమ్మకంతో వాహనాలను పైపులతో కడగడం, ర్యాంపులు, సెల్లార్లు, రోడ్లపై నీటిని పారించడం సాధారణమైపోయింది. కానీ ఆ నీరు ఎక్కడి నుంచి వస్తోంది? తిరిగి మన భూగర్భ జలాలను నింపేందుకు మనం ఏం చేస్తున్నాం? ఈ ప్రశ్నలు ప్రతి ఒక్కరినీ వెంటాడాలి.

ఇక్కడ మరో కీలకమైన అంశాన్ని విస్మరించకూడదు. తెలంగాణను దేశంలోనే ప్రధాన డేటా సెంటర్ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం పెట్టుబడులు, ఉద్యోగాలు, సాంకేతిక అభివృద్ధికి అవకాశాలను కల్పించవచ్చు. అయితే, కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్ సేవలకు అవసరమైన డేటా సెంటర్లలో కంప్యూటర్లను చల్లబరచడానికి గణనీయమైన నీరు, విద్యుత్తు అవసరమవుతాయి. దేశంలోని డేటా సెంటర్లలో సగానికి పైగా నీటి ఒత్తిడి ఉన్న ప్రాంతాల్లోనే ఉన్నాయని వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ఇండియా అధ్యయనం హెచ్చరిస్తోంది. తెలంగాణ కూడా ఈ సవాలును ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఒకటి. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో భారీ డేటా సెంటర్లకు అనుమతులు ఇచ్చేటప్పుడు వాటి నీటి అవసరాలను సమగ్రంగా అంచనా వేయడం తప్పనిసరి.

అభివృద్ధిని వ్యతిరేకించడం పరిష్కారం కాదు. కానీ ప్రజల తాగునీటి అవసరాల కంటే పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా సరైన విధానం కాదు. డేటా సెంటర్లకు సాధ్యమైనంత వరకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించడం, నీటి పునర్వినియోగ వ్యవస్థలను తప్పనిసరి చేయడం, తక్కువ నీరు అవసరమయ్యే శీతలీకరణ సాంకేతికతలను ప్రోత్సహించడం అవసరం. ప్రతి ప్రాజెక్టుకు రోజువారీ నీటి అవసరం, నీటి వనరు, భూగర్భ జలాలపై ప్రభావం, అత్యవసర పరిస్థితుల్లో నీటి వినియోగ ప్రణాళికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. పరిశ్రమలు తెచ్చే పెట్టుబడుల లెక్కలతో పాటు అవి వినియోగించే నీటి లెక్కలూ ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలి. మార్పు మన ఇంటి నుంచే మొదలవ్వాలి. కారుతున్న కుళాయిలను వెంటనే బాగుచేయాలి. వాహనాలను పైపులతో కాకుండా బకెట్‌తో కడగాలి. రోజువారీ శుభ్రతకు నీటిని పారబోయకుండా చీపురుతో ఊడ్చాలి. కూరగాయలు కడిగిన నీటిని మొక్కలకు ఉపయోగించాలి. ప్రతి భవనంలో వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, నీటి పునర్వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

సమాజంలో యువత ముందుకొచ్చి ఇంటింటికీ వెళ్లి నీటి పొదుపు ప్రాధాన్యాన్ని వివరించాలి. సర్క్యులర్ల కంటే వ్యక్తిగత సంభాషణ ప్రభావవంతంగా ఉంటుంది. ప్రతి కుటుంబం రోజూ కొంత నీటిని ఆదా చేసినా సమాజానికి గణనీయమైన ప్రయోజనం చేకూరుతుంది. నీటి సంక్షోభం కేవలం ప్రభుత్వ సమస్య కాదు, అది మనందరి బాధ్యత. ప్రకృతిని కాపాడటం, చెరువులను పునరుద్ధరించడం, మొక్కలు నాటడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం తక్షణ కర్తవ్యాలు. నీటిని ఆదా చేయడం పొదుపు మాత్రమే కాదు, భవిష్యత్తు తరాల జీవించే హక్కును కాపాడటం అభివృద్ధి కావాలి, పరిశ్రమలూ రావాలి, కానీ మనిషి దాహాన్ని తీర్చే నీటిని పణంగా పెట్టి కాదు. ప్రతి చుక్కను కాపాడుకుందాం, భవిష్యత్తును సురక్షితం చేసుకుందాం.

**కొలను వెంకటేశ్వర రెడ్డి**
SP Jails (Retd.)

# నవ్వు వెనుక బాధ

## smiling depression స్మైలింగ్ డిప్రెషన్

ఎవరైనా డిప్రెషన్‌లో ఉన్నారనగానే.. వారు మంచం దిగలేకపోతుంటారని, బాగా ఏడుస్తుంటారని, స్నేహితులకు దూరంగా ఉంటూ, రోజంతా గడపడానికే శక్తి లేకుండా ఉంటుంటారని మనసులో ఓ ఊహాచిత్రం వస్తుంటుంది. కానీ, అదే వ్యక్తి డిన్నర్లో జోకులు వేస్తూ, చురుకైన సామాజిక జీవితాన్ని గడుపుతూ, ఉద్యోగంలో రాణిస్తుండటాన్ని మీరు ఊహించలేరు. కానీ 'స్మైలింగ్ డిప్రెషన్' ఉన్నవారు సరిగ్గా ఇలాగే ఉంటారు. లోపల బాధపడుతూ పైకి గంభీరంగా, ధైర్యంగా కనిపిస్తుంటారు. కొన్నిసార్లు ఇలాంటి మోసానికి గురయ్యేది స్నేహితుడో, భాగస్వామో, సహచరుడో కాదు..స్వయంగా మిమ్మల్నే మీరు మోసం చేసుకోవచ్చు. 'స్మైలింగ్ డిప్రెషన్' అధికారికంగా గుర్తించిన వ్యాధి కాదు. కానీ, గత ఐదేళ్లలో ఈ పదం కోసం సెర్చ్ చేయడం 50 శాతం పెరిగింది.



**'స్మైలింగ్ డిప్రెషన్' అంటే ఏంటి?**

'బయటికి సంతోషంగా కనిపిస్తూ, లోపల కుంగిపోతూ, నిరాశగా ఉండటమే స్మైలింగ్ డిప్రెషన్' అని యూకేలోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ మానసిక ఆరోగ్య పరిశోధకురాలు డాక్టర్ ఒలివియా రెమెస్ చెప్పారు. మనమందరం ఎప్పుడో ఒకప్పుడు నిరాశకు గురవుతుంటాం. కానీ, ప్రపంచవ్యాప్తంగా 32.2 కోట్ల మందిలో ఈ భావాలు డిప్రెషన్‌గా మారుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) చెప్పింది. నిరంతరం బాధగా ఉండటం, ఆసక్తి లేదా ఆనందం కోల్పోవడం వంటి లక్షణాలు వారాల తరబడి లేదా నెలల తరబడి కొనసాగి.. పని, సంబంధాలు, నిద్ర, దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసినప్పుడు డిప్రెషన్‌గా పరిగణిస్తారు.

కానీ, డిప్రెషన్ ఎప్పుడూ మనం ఊహించినట్లే ఉండదు. వాస్తవానికి, డిప్రెషన్‌తో బాధపడుతున్న వారిలో దాదాపు 40 శాతం మంది 'అసహజ' రూపాన్ని అనుభవిస్తారని, వారి లక్షణాలు సాధారణ ధోరణులకు భిన్నంగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఉదాహరణకు, ఇలా డిప్రెషన్‌తో బాధపడే వారు సాధారణం కంటే ఎక్కువగా నిద్రపోవచ్చు లేదా తినవచ్చు. అలాగే ఏదైనా మంచి లేదా ఉత్సాహకరమైన విషయం జరిగినప్పుడు వారి మూడ్ తాత్కాలికంగా మెరుగుపడవచ్చు. ఇతరులతో కలిసిపోవడానికి ఒక వ్యక్తి తన నిర్దిష్ట లక్షణాలను లేదా భావోద్వేగాలను దాచిపెట్టడాన్ని 'క్యామోఫ్లాజింగ్' లేదా 'మాస్కింగ్' అంటారు. డిప్రెషన్‌తో బాధపడుతున్న వ్యక్తులు తాము సాధారణంగానే ఉన్నామని చెప్పడానికి ఇలాంటి పద్ధతులు పాటిస్తారని చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి.



**డిప్రెషన్‌ను ఎందుకు దాచిపెడతారు?**

కొంతమంది తమ నిరాశనిస్పృహలను 'చిరునవ్వు' వెనుక దాచిపెడుతున్నామనే విషయం కూడా గ్రహించలేరు. దీంతో తమకు డిప్రెషన్ ఉందని వారు తెలుసుకోలేరు. 'అవి బిజీగా, ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడపడం వల్ల వచ్చే లక్షణాలే అని వారు భావించవచ్చు' అని రెమెస్ చెప్పారు. మరికొందరు తాము ఇబ్బంది పడుతున్నామని గ్రహించినప్పటికీ, ఇతరులు దాన్ని గమనించకుండా జాగ్రత్త పడతారు. ఇది ముఖ్యంగా పరిపూర్ణతను కోరుకునే వారిలో అత్యంత బాధ్యతాయుతంగా ఉండే వారిలో సర్వసాధారణం. "వారికి వారిపైనే ఎక్కువ అంచనాలు ఉంటాయి. తాము ఇబ్బంది పడుతున్నామని తమకు తాము గానీ, ఇతరులకు గానీ ఒప్పుకోవడానికి ఇష్టపడకపోవచ్చు" అని ఆమె పేర్కొన్నారు.

కొంత మంది స్టిగ్మా పేరుతో భయపడతారు లేదా ఇతరులపై భారం పడుతుందని ఆందోళన చెందుతారు. తమను తప్పుగా అంచనా వేస్తారనే భయం లేదా పనిలో, సంబంధాలలో ప్రతికూల పరిణామాలు ఎదురవుతాయనే ఆందోళన ఇతరులలో ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. సాంస్కృతిక లేదా కుటుంబపరమైన అంచనాలు కూడా డిప్రెషన్‌తో బాధపడే కొంతమందిని తమ భావాలను బహిరంగంగా వ్యక్తం చేయకుండా అడ్డుపడతాయి.

**ప్రమాదాలేంటి?**

మానసికంగా మీరు నిరాశనిస్పృహలతో కుంచించుకుపోతూ ఇతరుల ముందు అన్నీ బానే ఉన్నట్టు నటించడం చాలా ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. 'డిప్రెషన్ మనలను సామాజికంగా ఒంటరిని చేస్తుంది. అందుకే మనసు సరిగ్గా లేకపోవడం నుంచి బయటపడటానికి ఉత్తమమైన మార్గాలలో ఇతరులతో తరచూ కనెక్ట్ కావడం ఒకటి' అని యూకేలోని ఎక్సెటర్ విశ్వవిద్యాలయ క్లినికల్ సైకాలజిస్ట్ ప్రొఫెసర్ బార్నీ డన్ చెప్పారు. 'ఈసంకేతాలను పట్టించుకోకపోతే, అవి తీవ్రమైన దీర్ఘకాలిక సమస్యలుగా మారిపోయే అవకాశం ఉంది.' అని రెమెస్ హెచ్చరించారు.

**డిప్రెషన్ లక్షణాలు**

మీ జీవితంలో అంతా సాఫీగా ఉందని భావిస్తున్నప్పుడు కొన్ని మార్పులను గమనించడం కష్టం కావచ్చు.

**ఆస్వాదించడం మానేస్తారు**

స్నేహితులను కలవడం, జిమ్‌కు వెళ్లడం లేదా మీకు ఇష్టమైన టీవీ షో చూడటం వంటి లాంటి సాధారణ విషయాలు కూడా మీకు భారంగా తోస్తుంటే మీ మనసులోకి మీరు మరింతగా తొంగిచూడటం అవసరం. 'బిజీగా ఉండే జీవనశైలి, లేదా పని ఒత్తిడి కారణంగా రోజువారీ పనుల పట్ల ఆసక్తి లేదా ఆనందం తగ్గిపోయిందని చెప్పడం సులభం' అని రెమెస్ అంటారు.

**కాళ్లు చేతులు భారంగా అనిపించడం**

ఏదో బరువు మోస్తున్నట్టు అనిపిస్తూ శరీర కదలికలను కష్టసాధ్యం చేసే లక్షణాన్ని 'లీడెన్ పెరాలిసిస్' అని పిలుస్తారు. బహుశా ఇది ఓ ప్రత్యేకమైన డిప్రెషన్ అయి ఉండొచ్చు. ఇది సాధారణ డిప్రెషన్ లక్షణాలకు భిన్నంగా అనిపిస్తుంటుంది.

**తరచూ ప్రణాళికల రద్దు**

మీరు కొన్నిసార్లు ఇతరుల ముందు చాలా ఉత్సాహంగా కనిపిస్తారు. కానీ, మీ మానసిక స్థితి బాగోలేనప్పుడు, మీ భావాలను దాచలేం అని భావించినప్పుడు ప్రణాళికలను రద్దు చేసుకుంటారు.

**ఎక్కువ నిద్రపోతున్నా, అలసటే..**

మీరు అన్ని సాధారణ కార్యకలాపాలను యథావిధిగా చేస్తూనే ఉండవచ్చు. కానీ మీ శక్తి హరించుకుపోతున్నట్టు అనిపించడం పెరుగుతుంది. 'ముఖ్యంగా సాయంత్రాలు మరింత కష్టంగా ఉండవచ్చు' అని రెమెస్ చెప్పారు. 'ఎందుకంటే ఈ పరిస్థితితో బాధపడుతున్న వ్యక్తులు రోజు ముగిసే సమయం వచ్చేసరికి మరింత నీరసంగా మారొచ్చు. వారికి సాధారణం కంటే ఎక్కువ నిద్ర అవసరం కావచ్చు' అన్నారు.

**విమర్శలకు బలహీనమవుతారు**

మీ బాస్ చేసే చిన్న కామెంట్, లేదా ఓ స్నేహితుడు చెప్పిన పని చేయకపోవడం మిమ్మల్ని చాలా ఎక్కువగా బాధిస్తుంది. విమర్శలు లేదా తిరస్కరణ పట్ల పెరిగిన ఈ బలహీనత (దీనిని ఏడీహెచ్‌డీ ఉన్నవారు కూడా అనుభవించవచ్చు) ఏటిపికల్ డిప్రెషన్ లక్షణమని రెమెస్ చెప్పారు.

**సరదా, సాయం రెండూ ఉంటాయి**

డిప్రెషన్‌తో బాధపడుతున్న వ్యక్తి ఎప్పుడూ అందరికీ దూరంగా ఒంటరిగా ఉండాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు వారు దీనికి పూర్తి భిన్నంగా ప్రవర్తించవచ్చు. ఉదాహరణకు, పార్టీల్లో అందరినీ నవ్విస్తూ ఉత్సాహంగా ఉండటం, తమ పనిలో పూర్తిగా మునిగిపోవడం లేదా ఇతరులకు సహాయం చేయడానికి తమ దారి మార్చుకుని మరీ వెళ్లడం లాంటివి చేస్తుంటారు.

**మీ 'లోపలిమాట ప్రతికూలం'**

మీరు బయటికి ఆత్మవిశ్వాసంతో కనిపించవచ్చు. కానీ, లోపల మాత్రం మిమ్మల్ని మీరే చాలా విమర్శించుకుంటుంటారు. స్వీయ–సందేహం, ఎందుకు పనికిరామనే భావన, శూన్యతగా అనిపించడం వంటివి హెచ్చరిక సంకేతాలు కావచ్చు.

**ఏది సాయపడొచ్చు?**

'చిరునవ్వు వెనుక దాగున్న డిప్రెషన్' అనే పదంపై ఏకాభిప్రాయంతో పాటు విభేదాలు కూడా ఉన్నాయి. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించడానికి దానికి ఒక పేరు పెట్టడానికి ఈ పదం సహాయపడినప్పటికీ, ఇది ఒక సంక్లిష్టమైన అనుభవాన్ని 'చాలా సులభతరమైనదిగా' మార్చే ప్రమాదం ఉందని రేమెస్ పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ 'నవ్వు' అనే పదం మనకు ఉల్లాసాన్ని, సంతోషాన్ని గుర్తుకు తెస్తుంది. కానీ ఈ పరిస్థితి ముఖ్య లక్షణం నిరాశ, శూన్యత పనికిరానివారం అనే భావన' అన్నారు.

ఇలాంటి స్థితి నుంచి బయటపడటానికి మీకు నమ్మకమైన వ్యక్తులతో మీ భావాలను పంచుకోవడం వంటి చిన్న విషయాలతో ప్రారంభించాలని డన్ సూచించారు.

ఆయన మాట్లాడుతూ, 'ఇలా చేయడం వల్ల ఇతరులతో సంబంధాలు మరింత బలపడతాయని, ఒకరికొకరు అనుబంధం ఏర్పడుతుందని ఈ భావనలతో తాము ఒంటరిగా పోరాడటం లేదనే విషయాన్ని గ్రహించి ప్రజలు తరచుగా ఆశ్చర్యపోతుంటారు' అని అన్నారు.

ఒకవేళ మీరు ఈ సమస్యతో బాధపడుతుంటే, వైద్యుడిని సంప్రదించాలని ఆయన సలహా ఇచ్చారు. 'టాక్ థెరపీ, యాంటిడిప్రెసెంట్ మందుల వాడకం, సోషల్ థెరపీ అన్నీ కూడా సమర్థవంతమైన పద్ధతులని చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి' అని పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

మంగళవారం 13.10.2026

www.mudranews.in | @mudranews



**ప్రొటీన్లు ఉండే ఆహారాన్ని తీసుకోండి!**

గుడ్లు, పప్పులు, పాలు, పెరుగు, చేపలు వంటి ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. జుట్టు, గడ్డం వెంట్రుకల పెరుగుదలకు ప్రొటీన్లు అవసరం. అయితే ప్రొటీన్లు ఎక్కువగా తీసుకున్నంత మాత్రాన తెల్ల వెంట్రుకలు రావని హామీ లేదు.



## కుమారికా దేవిగా భువనేశ్వరి అమ్మవారి దర్శనం



ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర భువనేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ విషయాలను ఆలయ పూజారి విజయకుమార్ శర్మ వెల్లడించారు. ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఈరోజు అమ్మవారు 'కుమారికా దేవి' అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు.అదేవిధంగా, ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో చిన్నారులకు కుమారికా పూజ మరియు సుహాసిని పూజలను అత్యంత వేడుకగా నిర్వహించినట్లు పూజారి తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

- ముద్ర, కూకట్‌పల్లి

## ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించాలి

**రబీ సీజన్‌లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి**

**ముద్ర, వనపర్తి:** ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. సోమవారం అంకూర్ గ్రామ రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు.గత ఏడాదితో పోలిస్తే వనపర్తి జిల్లాలో వర్షపాతం తగ్గిందని, రిజర్వాయర్లలోనూ నీటి లభ్యత తక్కువగా ఉందని కలెక్టర్ తెలిపారు. రాబోయే రబీ సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే చిరుధాన్యాలు, నూనెగింజల పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున వృద్ధులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతల పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించాలని, తక్కువ నీటితో పండే పంటలనే సాగు చేసేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. పంటలు సాగు చేసి నష్టపోయే పరిస్థితి రాకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని మంత్రి కోరారు. పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, జిల్లా ఉద్యానశాఖ అధికారి విజయ్ భాస్కర్, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వాసవిలో 'ఇన్‌ఫ్రానోవా–26' ప్రారంభం



**ముద్ర, రాజేంద్రనగర్:** హైదరాబాద్‌లోని వాసవి ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్ కళాశాలల సాంకేతిక పోటీలు 'ఇన్‌ఫ్రానోవా–26' సోమవారం ప్రారంభమయ్యాయి. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా స్టూడెంట్స్ చాప్టర్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.సివిల్ ఇంజనీరింగ్ హ్యాకథాన్, ఇన్‌ఫ్రానిక్స్, కాడాథాన్, సివిక్, ఐడియాస్కేప్ వంటి విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. సీబీఐటీ, ఎంవీఎస్ఆర్, వర్ధమాన్, సీవీఆర్, అనురాగ్ విశ్వవిద్యాలయం, ఏసీఈ, ఎస్ఆర్ విశ్వవిద్యాలయం, బీవీఆర్ఐటీ తదితర విద్యాసంస్థల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.వి. రమణ, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి. శ్రీధర్ మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల భద్రత, ఆటోమేషన్, సుస్థిర అభివృద్ధి, ఆధునిక సాంకేతికతలకు సంబంధించిన సమస్యలకు వినూత్న పరిష్కారాలను కనుగొనడమే ఈ హ్యాకథాన్ లక్ష్యమని తెలిపారు. తొలిరోజు ఇన్‌ఫ్రానిక్స్ స్క్రీనింగ్ రౌండ్‌లో విద్యార్థులు వాస్తవ సివిల్ ఇంజనీరింగ్ సమస్యలపై తమ ఆలోచనలు, పరిష్కారాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. జయశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణదీప చక్రబోర్తి అధ్యాపక బృందం, విద్యార్థి సమన్వయకర్తల సహకారంతో నిర్వహిస్తున్నారు.

## నషా ముక్త్ భారత్ అభియాన్ పటిష్ట అమలుకు ప్రత్యేక కార్యాచరణ

**గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ ఎం.దానకిశోర్**



**ముద్ర, హైదరాబాద్ :** యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించి, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి అన్ని జిల్లాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ ఎం. దానకిశోర్ సూచించారు.సోమవారం లోక్‌భవన్‌లో జిల్లా రెడ్‌క్రాస్ శాఖల ప్రతినిధులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్, టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. దసరా అనంతరం అవగాహన ర్యాలీలు, విద్యాసంస్థల్లో సదస్సులు, పోస్టర్ ప్రదర్శనలు, ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ వాలంటీర్లను భాగస్వాములను చేయాలని తెలిపారు. క్షయవ్యాధి బాధితులకు పౌష్టికాహారం అందించేందుకు వైద్య ఆరోగ్యశాఖలు, దాతృత్వ సంస్థలతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. రెండు కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా శాఖలకు సూచించారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ జనరల్ సెక్రటరీ, సీఈఓ ప్రొఫెసర్ ఎ. శ్రీరాములు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో అట్టహాసంగా బతుకమ్మ సంబురాలు

**మహిళా నాయకులతో కలిసి బతుకమ్మ పేర్చిన కల్వకుంట్ల కవిత**

**రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మహిళలకు 50 శాతం సీట్లు ఇస్తాం**

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మహిళా నాయకులతో కలిసి బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ సంబురాల్లో పాల్గొన్నారు. అనంతరం గౌరమ్మకు పూజలు నిర్వహించి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. దీంతో పార్టీ కార్యాలయం పండుగ సందడితో కళకళలాడింది.ఈ సందర్భంగా కవిత బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో మహిళలను ఏకతాటిపైకి తీసుకురావడంలో బతుకమ్మ పోషించిన పాత్రను వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటేలా ప్రతి ఒక్కరూ బతుకమ్మ వేడుకలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ పాటలను నేర్చుకొని భావితరాలకు అందించాలని సూచించారు.మహిళలకు 50 శాతం సీట్లు ఇస్తాంమహిళలు, బహుజనుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న తనను, తమ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని కవిత విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇతర పార్టీలు మహిళా రిజర్వేషన్లలగను అమలు చేసినా, చేయకపోయినా తెలంగాణ రక్షణ సేన మాత్రం రిజర్వేషన్లతో సంబంధం లేకుండా 50 శాతం సీట్లను మహిళలకు కేటాయిస్తుందని ప్రకటించారు.రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన అనంతరం పార్టీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా చాటాలని కోరారు.తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకతెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మ మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని కవిత గుర్తుచేశారు. బతుకమ్మ పండుగ తనకు ఎంతో ఇష్టమని చెబుతూ, గౌరమ్మ తల్లి ఆశీస్సులతో తెలంగాణ ఆడబిడ్డలందరూ సంతోషంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె పేర్కొన్నారు.

## జేఎన్టీయూహెచ్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ముద్ర, కూకట్‌పల్లి:** జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం సైన్స్ బ్లాక్ వద్ద 'స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం' ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. కె పి హెచ్ బి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ఈ వేడుకలను ప్రారంభించారు. భక్తిశ్రద్ధలతో, సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకురాలు లక్ష్మి మాట్లాడుతూ పూలను పూజించే విశిష్ట సంస్కృతి బతుకమ్మ పండుగ సొంతమని అన్నారు. మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా, గౌరమ్మ, దుర్గమ్మల ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలోని రుగ్మతలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అంతరిక్ష పరిశోధనల నుండి దేశ పునర్నిర్మాణం వరకు అన్ని రంగాల్లోనూ మహిళలు పురుషులతో సమానంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కె పి హెచ్ బి ఎస్సై శశిధర్ తో పాటు వందలాది మంది విద్యార్థినులు సంగెం సిరి, ప్రతిభ, యశ్విత, శ్రావ్య, హర్షిత, భావన, అక్షయ, అక్షర, శిల్ప, మనస్విత, ప్రసన్న, అఖిల, చందన పాల్గొన్నారు.

## హౌసింగ్ సొసైటీ భూ సమస్యపై సమీక్ష



**ముద్ర, కూకట్‌పల్లి :**గాయత్రీ నగర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 1007లో ఉన్న భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూ సమస్యను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ బండి రమేష్ గారు పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులను అడిగి భూ సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం సమస్య మూల కారణాలపై నాయకులతో సమగ్రంగా చర్చించి, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, న్యాయం జరిగేలా సమస్య పరిష్కారానికి సంబంధించిన అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం బండి రమేష్ గారు మాట్లాడుతూ... "స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది. బాధితులు తమ సమస్యలను నా దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి నా వంతు శక్త్యనుసారంగా కృషి చేస్తాను" అని భరోసా ఇచ్చారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, గాయత్రీ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్తాన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వేముల సత్యం, రాఘవేంద్రరావు, కనకయ్య, విట్టల్ రెడ్డి, ఇంద్ర సింగ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యపై క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే పరిశీలన



**ముద్ర, కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ఎల్ఐజీ 22–23 ప్రాంతంలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి సమస్యను పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం వాటర్‌వర్క్స్ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు.ప్రాంతంలో పారిశుద్ధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో నిర్లక్ష్యం వహించవద్దని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. వాటర్‌వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## నూతన దుకాణాలు, వసతి గృహం ప్రారంభం



**ముద్ర, కూకట్‌పల్లి :** శంషిగూడ మరియు హైదర్ నగర్ డివిజన్ల పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలను, సిబ్బంది వసతి గృహాన్ని పిఏసి చైర్మన్, శాసనసభ్యులు శ్రీ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ ఆర్కపూడి గాంధీ మాట్లాడుతూ... కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని నేటి నుంచి అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రాంగణంలో పనిచేసే సిబ్బందికి వసతి సదుపాయం కల్పించడం అభినందనీయమైన విషయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీ శాతవాహన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి, మోకిల సింగిల్ విండో చైర్మన్ ల ప్రమాణ స్వీకారం





**ముద్ర, చేవెళ్ల:** రైతులకు అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికీ కృషి చేస్తామని శంకర్ పల్లి, మోకిల ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి, గౌండ్ర సత్యం అన్నారు. నూతనంగా నియమించబడ్డ వారు ఇద్దరు సోమవారం వారి కార్యాలయాల్లో ప్రమాణ స్వీకారం చేశారు. వారితో పాటు పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. శంకర్ పల్లి ప్రాథమిక సహకార సంఘం వైస్ చైర్మన్ గా శంకర్ పల్లి పురపాలికకు చెందిన పార్సి బాల కృష్ణ నియమించబడ్డారు. నూతన పాలక మండలి చైర్మన్ లు, సభ్యులు మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే యాదయ్య కు, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వారిని ప్రజాప్రతినిధులు, నాయకులు, మిత్రులు ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సీఈఓ లు, ప్రజాప్రతినిధులు, నాయకులు గోపాల్ రెడ్డి, మోహన్, శ్రీనివాస్, సురేష్, కాంతి రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి రాంరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారి వేధింపులు

**రూ.10 లక్షల అప్పుకు రూ.14.71 లక్షలు చెల్లించినా రూ.27 లక్షలు డిమాండ్**

**ముద్ర, కుత్బుల్లాపూర్:** జగద్గిరిగుట్ట ప్రాంతంలో అప్పుల వేధింపులకు సంబంధించిన ఒక ఘటన వెలుగులోకి వచ్చింది. ఎమ్మార్వో కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఎర్రోళ్ల రేణుకను, అదే కార్యాలయంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న వాసు మరియు ఇతరులు తీవ్రంగా వేధింపులకు గురిచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం . ఇల్లు నిర్మాణ నిమిత్తం రేణుక నిందితుడు వాసు వద్ద మొదట రూ.6 లక్షలు, ఆ తరువాత మరో రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నారు. డిసెంబర్ 16, 2025 నాటికి ఫోన్‌పే, గూగుల్ పే మరియు బ్యాంక్ ఖాతాల ద్వారా ఆమె మొత్తం రూ.14,71,000 చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంత మొత్త చెల్లించినప్పటికీ, పది రోజులకు పది రూపాయల వడ్డీ లెక్కగట్టి ఇంకా రూ.27 లక్షలు చెల్లించాలని నిందితుడు డిమాండ్ చేశాడు. బాధితురాలిని దయాకర్ రెడ్డి అనే వ్యక్తికి పరిచయం చేసి, ఇంటి పత్రాలు తనఖా పెట్టి రూ.9 లక్షలు తీసుకునేలా ఒత్తిడి తెచ్చారు.అదనపు డబ్బులు ఇవ్వకపోతే ఇంటిని ఖాళీ చేయాలని, పిల్లల సంగతి చూస్తామని మరియు ఇతరులను ఇంటికి పంపిస్తామని నిందితులు వాసు, దయాకర్ రెడ్డి మరియు శ్రీలత బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 1135/2026 కింద BNS సెక్షన్ 308(2) క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ఉద్యోగం నుంచి తొలగించారనే కక్షతో చిన్నారి కిడ్నాప్, హత్య?

**రూ.20 లక్షల కోసం పథకం..**

**మరో ఇద్దరి సహకారం?**

**బొల్లారం ఘటనలో కీలక వివరాలు..**

**నిందితులను విచారిస్తున్న పోలీసులు**

**ముద్ర, హైదరాబాద్:** ఉద్యోగం నుంచి తొలగించారనే కక్షతో ఓ సెక్యూరిటీ గార్డు చిన్నారిని కిడ్నాప్ చేసి, ఆమె తండ్రిని రూ.20 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. బొల్లారంలో చిన్నారి కిడ్నాప్, హత్య కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న విక్రమ్‌కు మరో సెక్యూరిటీ గార్డు, స్థానిక ఎలక్ట్రీషియన్ సహకరించినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పలు కీలక అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఉద్యోగం నుంచి తొలగించడంతో కక్ష?విల్లా కమ్యూనిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన విక్రమ్ ప్రవర్తన సరిగా లేదనే కారణంతో యాజమాన్యం వారం రోజుల క్రితమే ఉద్యోగం నుంచి తొలగించినట్లు సమాచారం. దీంతో కక్ష పెంచుకున్న అతడు చిన్నారిని కిడ్నాప్ చేసి, ఆమె తండ్రి నుంచి డబ్బులు వసూలు చేయాలని పథకం వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.మరో ఇద్దరి సహకారం?చిన్నారిని కిడ్నాప్ చేసిన అనంతరం మరో సెక్యూరిటీ గార్డుకు చెందిన ఫోన్ నుంచి ఆమె తండ్రికి కాల్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే, పెత్రమాస బతుకమ్మ వేడుకల సందర్భంగా కమ్యూనిటీలో ప్రజల రాకపోకలు పెరగడంతో పట్టుబడతామనే భయంతో చిన్నారిని హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది.ఈ ఘటనలో విక్రమ్ చిన్నారిని హత్య చేసినట్లు ఆరోపణలు ఉండగా, ఎలక్ట్రీషియన్ బతుకమ్మ పాటల శబ్దాన్ని పెంచి చిన్నారి అరుపులు బయటకు వినిపించకుండా చేశాడని, మరో సెక్యూరిటీ గార్డు ఎవరూ అక్కడికి రాకుండా కాపలా కాసినట్లు సమాచారం.ఫోన్ ఆధారంగా పోలీసుల దర్యాప్తుచిన్నారి తండ్రికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన నంబర్‌ను





పోలీసులు ట్రేస్ చేశారు. ఆ ఫోన్ మరో సెక్యూరిటీ గార్డు వద్ద ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. విక్రమ్‌కు సహకరించినట్లు అనుమానిస్తున్న మరో సెక్యూరిటీ గార్డు, ఎలక్ట్రీషియన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.ఈ కేసులో నిందితుల పాత్ర, ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఇతర ఆధారాలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులపై వచ్చిన ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది.

### చిన్న వయసులోనే గడ్డం తెల్లబడితే వైద్యుడిని సంప్రదించండి!

కుటుంబ చరిత్ర, జన్యుపరమైన కారణాల వల్ల కూడా గడ్డం వెంట్రుకలు తెల్లబడవచ్చు. కొన్నిసార్లు విటమిన్ B12 లోపం లేదా థైరాయిడ్ సమస్యలు కూడా కారణం కావచ్చు. చిన్న వయసులోనే వేగంగా గడ్డం తెల్లబడుతుంటే వైద్యుడిని సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవడం మంచిది.



## బాధితుడికి సీఎం రేవంత్ అండ

**ముద్ర, హైదరాబాద్:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్ కు వెళ్లిన సుదర్శన్ గౌడ్ క్షిపణులు, డ్రోన్ దాడుల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ముఖ్యమంత్రి గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, సంతాపం తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సుదర్శన్ గౌడ్ భార్య విజ్ఞప్తి మేరకు ఈ ఘటనను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి గారు బాధిత కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఈ ఆర్థిక సహాయం అందించేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుదర్శన్ గౌడ్ భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి



**ముద్ర, కరీంనగర్ :** జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు విద్యా సంవత్సరం ముగియకముందే స్కాలర్షిప్ టెస్టులు నిర్వహించి ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు దుప్పటపల్లి మురళి మిట్ట ఆరోపించారు. ప్రైవేటు పాఠశాల, కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్కాలర్షిప్ టెస్ట్ పేరిట విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేస్తున్న పాఠశాలలు, జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని.. జిల్లా విద్యాశాఖ అధికారికి పలుమార్లు వినతి పత్రం ఇచ్చిన కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కరీంనగర్ కొత్త కలెక్టరేట్‌లో పాత ఫర్నీచర్, విరిగిపోయిన కుర్చీలు!



**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనాన్ని రూ.51 కోట్లు వ్యయంతో నిర్మించారు. గత కొన్ని రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ ముఖ ద్వారం వద్ద పాత ఫర్నీచర్, విరిగిపోయిన కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తుండగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రజలకు కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు

## ఎల్ నినో పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోంది

**ముద్ర, కరీంనగర్:** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం కనీస స్పందన లేకుండా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల జీవితాలతో పాలకులు చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ద్వారా రైతు వేదికల వద్దకు రావాలని ఉదయం సమాచారం పంపి, మళ్లీ చివరి నిమిషంలో దాన్ని రద్దు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న అత్యంత గంభీరమైన సమస్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆరోపించారు.

**ముందస్తు హెచ్చరికలను గాలికొదిలేశారు.. ఇప్పుడు ఉచిత సలహాలు**

తొమ్మిది నెలల క్రితమే శాస్త్రవేత్తలు , కేంద్ర ప్రభుత్వం ఎల్ నినో ముప్పుపై రాష్ట్రాన్ని అప్రమత్తం చేసినప్పటికీ, ప్రభుత్వం పట్టించుకోలేదని హరీష్ రావు విమర్శించారు. అప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోని పాలకులు, ఇప్పుడు మాత్రం ఉచిత సలహాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. పంటలు వేయవద్దని చెబుతున్న ప్రభుత్వం, మరి ఆ రైతుల, రైతు కూలీల బతుకుల మాటేమిటని నిలదీశారు. కూలీలకు ఉపాధి కల్పించకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ హయాంలో అద్భుతమైన సంక్షేమ చర్యల వల్ల వలసలు పూర్తిగా నిలిచిపోయి ప్రజలు ఊర్లలోనే ఉన్నారని, కానీ నేడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ వలసల గోస మొదలైందని ఆవేదన వ్యక్తం చేశారు.

**మంత్రుల మీటింగ్ రద్దు.. ఎల్ నినోను అడ్డుగోడగా వాడకం**

రాష్ట్రంలో తాగు, సాగు నీటి సమస్యపై చర్చించాల్సిన మంత్రుల సమావేశాన్ని అర్ధాంతరంగా రద్దు చేసి పాలకులు ఢిల్లీ ప్రయాణాలు పెట్టుకోవడం సిగ్గుచేటని హరీష్ రావు దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రతి వైఫల్యానికి ఎల్ నినోతో లింక్ పెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు.

# గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం







**కరీంనగర్ మహాశక్తి ఆలయంలో అంగరంగ వైభవంగా రెండో రోజు నవరాత్రి ఉత్సవాలు**
**లింగార్చనలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్**
**మరికాసేపట్లో దాండియా**
**ఆలయానికి బారులు తీరిన వేలాది మంది భక్తులు**

**ముద్ర, హైదరాబాద్ :** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో ఈరోజు గాయత్రీదేవి (బ్రహ్మచారిణి) రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు చంద్రఘటంతో, గాజులతో అలంకరణతో అమ్మవారిని అలంకరించారు. వేలాది మంది భక్తులు ఈరోజు అమ్మవారిని దర్శించుకున్నారు.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. వేదమాతగా, జ్ఞానప్రదాయినిగా, సకల చైతన్యానికి మూలశక్తిగా గాయత్రీదేవిని భక్తులు ఆరాధిస్తారు. అమ్మవారి ఈ రూపం జ్ఞానం, వివేకం, పవిత్రత, ఆధ్యాత్మిక తేజస్సుకు ప్రతీకగా నిలుస్తుంది. దసరా నవరాత్రుల్లో గాయత్రీదేవి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందించడంతోపాటు జ్ఞానానికి, ధర్మానికి ప్రాధాన్యమివ్వాలనే సందేశాన్ని గుర్తుచేస్తుంది.

**జ్ఞానమార్గంలో నడిపించే జగన్మాత**

గాయత్రీదేవి ఆరాధన ద్వారా విద్య, వివేకం, ఏకాగ్రత, సత్ప్రవర్తన కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పెంపొందించుకోవడం, మంచి ఆలోచనలతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం ఈ ఆరాధనలోని ప్రధాన సందేశంగా భావిస్తారు.

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారి ఆలయంలో లింగార్ఛన కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. పిండితో లింగాకారం ప్రతిష్టించి అభిషేకం చేశారు. దీపాలు వెలిగించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేశ్ సహ పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సైతం దాండియా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. వేలాది మంది భక్తులు ఆధ్యాత్మిక భావనతో ఆడుతూ పాడుతూ దాండియాలో పాల్గొనున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి పొద్దుపోయే వరకు ఆలయంలో అమ్మవారి సేవలోనే గడుపుతున్నారు. ఆద్యంతం దాండియా కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

## ఉమ్రా యాత్రలో విషాదం..

**బాంబ్ దాడిలో హైదరాబాద్ టెక్కీ మృతి.**



**ముద్ర, హైదరాబాద్ :** ఉమ్రా యాత్ర హైదరాబాదీ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులతో కలిసి ఐటీ ఉద్యోగి మహమ్మద్ యూసుఫ్ (46) సౌదీ అరేబియాలో ఉమ్రా యాత్రకు వెళ్లాడు. అక్టోబర్ 10న రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో 13 మంది చనిపోగా.. ఇందులో హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ యూసుఫ్ ప్రాణాలు కోల్పోగా.. భార్య, పిల్లలకు గాయాలయ్యాయి. పవిత్ర యాత్రకు వెళ్లి యూసుఫ్ ప్రాణా లు కోల్పోవడంతో హైదరాబాద్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధు వులు, స్నేహితులు కన్నీరుమున్నీరు అవుతు న్నారు.

## టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లో కొనసాగుతున్న దసరా రద్దీ

**ప్రయాణికుల అవసరాలకు తగినట్లుగా అదనపు బస్సు సర్వీసులు**
**ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి**
**అధికారులకు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశాలు**
**తొలి 3 రోజుల్లోనే కోటి నలభై లక్షల మంది ప్రయాణం.**



**ముద్ర, హైదరాబాద్ :** దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) నడుపుతున్న ప్రత్యేక బస్సు సర్వీసులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దసరా పండుగ రద్దీ నిర్వహణ మరియు అదనపు బస్సుల ఆపరేషన్లపై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి సోమవారం అధికారులతో జూమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పండుగ వేళ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సర్వీసులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

ఈ దసరా పండుగ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ రికార్డు స్థాయిలో సర్వీసులను నడుపుతూ మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందించింది. గత ఏడాది (2025) దసరా తొలి మూడు రోజుల్లో 922 అదనపు బస్సులను నడపగా... ఈ ఏడాది అక్టోబర్ 9, 10, 11 తేదీలలో గతంతో పోలిస్తే 495 బస్సులు అదనంగా, అంటే మొత్తం 1,417 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చారు...

అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా దసరా పండుగ వేళ మహిళలకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది. గత ఏడాది దసరా సమయంలో రోజుకు సగటున రూ. 13.02 కోట్లు ఆదా కాగా, ఈ ఏడాది దసరా రద్దీ సమయంలో మహిళలు రోజుకు రూ. 13.73 కోట్ల మేర ఆదా చేసుకోగలిగారు.

పండుగ ముందు రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వంత ఊర్లకు ప్రయాణమయ్యే వారి కోసం ఈ నెల 15, 16, 17 తేదీల్లో కూడా రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడపాలని అధికారులను ఎండీ వై. నాగిరెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మరియు ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చని, ఇతర వివరాలు, ప్రయాణ సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని సూచించారు.

# నెలకు రూ.5 వేలేనా? వైద్యుల ఆందోళన..

**- సిరిసిల్లలో ఓపీ బంద్.!**
**సిరిసిల్లలో జూనియర్ డాక్టర్ల నిరసన**
**రూ.29,792కి బదులు రూ.5 వేలే చెల్లింపు**
**ఓపీ విధులు బహిష్కరించి ఆందోళన**
**పూర్తి స్టైపెండ్ ఇవ్వాలని డిమాండ్**




**ముద్ర, కరీంనగర్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వం నిర్దేశించిన స్టైపెండ్‌కు, తమకు అందుతున్న వేతనానికి పొంతన లేకపోవడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం నెలకు రూ.5 వేల స్టైపెండ్‌తో వైద్య సేవలు ఎలా అందించాలంటూ ప్రశ్నిస్తూ ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. సమాన పనికి సమాన స్టైపెండ్ ఇవ్వాలనే న్యాయసూత్రం ప్రకారం తమకు పూర్తి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మొత్తం 31 మంది జూనియర్ డాక్టర్లు ఈ నిరసన కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు.

**అర్హత ఉన్నా అందుతున్నది రూ.5 వేలే..**

గత జూన్ నెల నుంచి ఇంటర్న్‌షిప్ విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ డాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించిన స్టైపెండ్ రూ. 29,792గా ఉండగా, క్షేత్రస్థాయిలో తమకు మాత్రం కేవలం రూ. 5 వేలు మాత్రమే అందుతున్నాయని వారు వాపోయారు. రోజుకు కేవలం రూ. 166 చొప్పున వస్తున్న ఈ నామమాత్రపు మొత్తంతో రోజువారీ కనీస అవసరాలు, ఇతర ఖర్చులు తీర్చుకోవడం అత్యంత కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ఎంబీబీఎస్ ఇంటర్న్‌లతో సమానంగా, రెగ్యులర్ డాక్టర్లతో పోటీపడి విధులు నిర్వహిస్తున్నప్పటికీ, స్టైపెండ్ విషయంలో మాత్రం ఇంత భారీ వ్యత్యాసం ఉండటం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి**

ఇతర ప్రాంతాల్లోని వైద్యులతో సమానంగా సేవలు అందిస్తున్న తమ పట్ల వివక్ష చూపడం తగదని జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత వైద్యారోగ్య శాఖ అధికారులు ఈ సమస్యపై స్పందించి తక్షణ స్పష్టత ఇవ్వాలని కోరారు. తమకు రావాల్సిన బకాయిలను, పూర్తి స్థాయి స్టైపెండ్‌ను వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి సమస్యను పరిష్కరించే వరకు నిరసనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఓపీ విధులను బహిష్కరించి ఫ్లకార్డులతో ఆసుపత్రి ప్రాంగణంలో వారు నిరసన తెలపడంతో వైద్యవర్గాల్లో చర్చనీయాంశమైంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 13.10.2026
www.mudranews.in | @mudranews



**పోషకాహారం తీసుకోండి.. తెల్ల గడ్డానికి చెక్ పెట్టండి**



శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోవడం వల్ల కొందరిలో చిన్న వయసులోనే గడ్డం వెంట్రుకలు తెల్లబడవచ్చు. అందుకే విటమిన్ B12, ఐరన్, జింక్ వంటి పోషకాలు లభించే ఆహారాన్ని తీసుకోవాలి. అయితే తెల్ల వెంట్రుకలకు పోషకాహార లోపమే ఏకైక కారణం కాదు.

# రబీలో వరి సాగుకు దూరంగా ఉండాలి

**తక్కువ నీటితో పండే పంటలు వేయాలి**

**కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని, వరి సాగుకు దూరంగా ఉండాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. రైతులకు అందుబాటులో ఉన్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమవారం రామాయంపేటలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు. రైతులకు పలు సూచనలు చేశారు. మూడు లక్షల 14 వేల ఎకరాలు వరి సాగు చేయాల్సి ఉండగా ఎల్ నీనో ప్రభావంతో వ్యవసాయ శాఖ అధికారుల అవగాహనతో రైతులు కేవలం 1 లక్ష 94 వేల ఎకరాలు మాత్రమే వరి సాగు చేశారు. నీటి ఎద్దడిని అధిగమించే విధంగా మిగతా రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గుచూపి సాగు చేస్తున్నారన్నారు. గతంలో కంటే 28 వేల ఎకరాలు అధికంగా అంతర్ పంటలు పండిస్తున్నారు. రైతులు తమ వద్ద అందుబాటులో ఉన్న భూమి, నీటి వనరులు, వాతావరణ పరిస్థితులను బట్టి ఏ పంట సాగు చేయాలనే విషయాన్ని నిర్ణయించుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకొని పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా పెట్టుబడి నష్టాలను నివారించు కోవచ్చని పేర్కొన్నారు.సూక్ష్మ సేద్య పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం వరకు, జనరల్, ఓబీసీ వర్గాలకు చెందిన రైతులకు 80 శాతం వరకు సబ్సిడీ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, వ్యవసాయ ఇన్‌పుట్స్ అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సీపీవో సురేష్, మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు బైరం స్వప్న కుమార్, గజవాడ నాగరాజు గుప్తా, డాకీ శ్యామల స్వామి, కొక్కు ప్రవీణ్, ఆదర్శ రైతు అశోక్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ లో సత్తా చాటిన హోంగార్డు కుమార్తె

**అంతర్జాతీయ స్థాయిలో 16 బంగారు పతకాలు**
**గ్లోబల్ బ్రూస్ లీ అవార్డు అందుకున్న నితన్య సిరి**
**అభినందించిన ఎస్పీ శ్రీనివాసరావు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న నామ కృష్ణ కుమార్తె నామ నితన్య సిరి మార్షల్ ఆర్ట్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటింది. 16 బంగారు పతకాలు సాధించడంతో పాటు గ్లోబల్ మార్షల్ ఆర్ట్స్ బ్రూస్ లీ అవార్డును అందుకుంది. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.నామ నితన్య సిరిని ఎస్పీ శాలువాతో సత్కరించి, సర్టిఫికెట్‌తో పాటు అవార్డును అందజేశారు. మార్షల్ ఆర్ట్స్‌లో ఆమె సాధించిన విజయాలను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. డియస్పి రంగానాథ్, ఆర్ఐ శైలందర్, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

## ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్ష పాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసు కున్నారు.భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా విచారణ పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంతో పాటు సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీ తనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.

## పటిష్ట ప్రణాళికతో రీసర్వే నిర్వహించాలి




**ముద్ర ప్రతినిధి, మెదక్:**పటిష్ట ప్రణాళికతో గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో సర్వే అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. రీ సర్వేలో సర్వే అధికారులు, రెవెన్యూ అధికారుల పాత్ర కీల కమన్నారు. గ్రామాల్లో రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించి, పలు సందేహాలను నివృత్తి చేయాలన్నారు. రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో 9(2) నోటీసులు అందిన వారి అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించా లన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ , సర్వే శాఖల సమన్వయంతో నిర్వహించా లన్నారు. డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ఏడి సర్వే కిషన్, డిప్యూటీ తహసిల్దారులు, ఇన్స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీపీ రాత పరీక్ష ఫలితాలు విడుదల

**ఈ నెల 17న సర్టిఫికెట్ల పరిశీలన**



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రాసిక్యూషన్ సర్వీస్‌లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) సోమవారం విడుదల చేసింది. ఈ విషయాన్ని బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో వెల్లడించారు.2025 ఆగస్టు 15న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, అదే ఏడాది డిసెంబరు 14న హైదరాబాద్ పరిసరాల్లోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో రెండు పేపర్లుగా రాత పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. డిసెంబరు 21న ప్రాథమిక సమాధానాల కీని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచి, డిసెంబరు 24 వరకు అభ్యంతరాలను స్వీకరించామని పేర్కొన్నారు. నిపుణుల పరిశీలన అనంతరం తుది కీని రూపొందించినట్లు వివరించారు.తుది కీతో పాటు అభ్యర్థుల ఓఎంఆర్ సమాధాన పత్రాల డిజిటల్ ప్రతులను www.tgprb.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్ ఖాతాల్లో ఫలితాల షీట్లను ఉంచినందున, తమ వివరాలతో లాగిన్ అయి ఫలితాలను పరిశీలించుకోవాలని సూచించారు.17న ధ్రువపత్రాల పరిశీలనరాత పరీక్షలో పేపర్-1, పేపర్-2లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 17న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు. అర్హులు వెబ్‌సైట్ నుంచి కాల్‌లెటర్ (ఇంటిమేషన్ లెటర్)ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అందులో పేర్కొన్న వేదిక, సమయానికి అన్ని అసలు ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని సూచించారు.అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతితో పాటు ఫలితాల షీట్, వెరిఫికేషన్ లెటర్, గుర్తింపు కార్డు, పుట్టిన తేదీ నిర్ధారణకు ఎస్సెస్సీ లేదా మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్ తీసుకు రావాలి. విద్యార్థులకు సంబంధించిన డిగ్రీ, ఎల్ఎల్‌బీ/బీఎల్ సర్టిఫికెట్లు, బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ సర్టిఫికెట్, క్రిమినల్ కోర్టుల్లో కనీసం మూడేళ్ల న్యాయవాద అనుభవాన్ని ధ్రువీకరించే పత్రాలను సమర్పించాలి. స్థానికత నిర్ధారణకు 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు లేదా సూచించిన ప్రత్యామ్నాయ నివాస ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని తెలిపారు.రిజర్వేషన్ అభ్యర్థులకు సూచనలురిజర్వేషన్లు, వయోపరిమితి సడలింపులు పొందే అభ్యర్థులు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన తాజా కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. ఎస్సీ అభ్యర్థులు వర్గీకరణను తెలిపే గ్రూప్-I, II లేదా III సర్టిఫికెట్ సమర్పించాలి. బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 2025 ఏప్రిల్ 1 తర్వాత జారీ చేసిన తాజా ధ్రువపత్రాలను తీసుకు రావాలి. దివ్యాంగులు, క్రీడాకారులు, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్లు, మాజీ సైనికులు, ప్రభుత్వ ఉద్యోగులు తమకు వర్తించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులకు ఉద్యోగంపై ఆసక్తి లేనట్లుగా భావించి బోర్డు తదుపరి చర్యలు తీసుకుంటుందని చైర్మన్ స్పష్టం చేశారు. ఫలితాలు లేదా పరిశీలన ప్రక్రియలో సమస్యలు ఎదురైతే support@tslprb.inకు ఈమెయిల్ చేయాలని లేదా 040-41895151 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.

## బిల్లులు ఇప్పించాలని మాజీ సర్పంచ్ విజ్ఞప్తి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** హవేలీ ఘనపూర్ మండలం నాగపూర్ మాజీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి తన హయాంలో ఖర్చు చేసిన వీధి దీపాలు, ట్రాక్టర్ డీజిల్ బిల్లులు ఇప్పించాలని ప్రజావాణిలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ కు ఫిర్యాదు చేశారు. 2022 నుండి 2024 జనవరి 30 వరకు పెట్టిన బిల్లులు ఎంబి రికార్డ్ చేసి ఆడిట్ కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. బిల్లులు చెల్లించకుండా 2024 ఫిబ్రవరి నుండి పంచాయతీ సెక్రటరీలు చేసిన పనులకు డీజిల్ బిల్లులను చెల్లించారన్నారు. అంతకుముందు చేసిన 3,29,232 రూపాయలు మాజీ సర్పంచ్ బిల్లులు చెల్లించకుండా పాలకవర్గం పక్షపాత ధోరణితో బిల్లులు ఆపేయడం సరికాదన్నారు.

## ఘనంగా తుల్జాభవాని గర్భగుడి గడప ప్రతిష్ట మహోత్సవం



**ముద్ర, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని తారానగర్ లో గల శ్రీశ్రీశ్రీ తుల్జాభవాని అమ్మవారి దేవాలయం పునర్నిర్మాణం మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అమ్మవారి గర్భగుడి గడప ప్రతిష్ట కార్యక్రమంలో ఈవో సత్యచంద్రారెడ్డి, చైర్మన్ రఘునాథ్ యాదవ్, తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, ఆలయ చైర్మన్ బీకే రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి పీయేసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. తుల్జాభవాని అమ్మవారి ఆలయం పునర్నిర్మాణం అందరికీ ఆమోదయోగ్యమయ్యే విధంగా చేపడుతామని చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఆలయ పునర్నిర్మాణం కోసం ముందుకు వచ్చిన సీనియర్ నాయకులు బీకే రాఘవ రెడ్డి వారి కుమారుడు రాజశేఖర్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించారు. తుల్జాభవాని అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి తన వంతుగా సంపూర్ణ సహకారం అందిస్తానని, ఆలయ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చైర్మన్ గాంధీ హామీ ఇచ్చారు. తుల్జా భవాని అమ్మవారి ఆలయాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతంగా, అన్ని హంగుల తో సకల సౌకర్యాలతో, అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేసి.. శేరిలింగంపల్లి ప్రాంతానికి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని గాంధీ తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, రఘునాథ్ రెడ్డి, మాజి కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మరియు కే.రాం చందర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, గోవింద్ చారీ, పాండు, నటరాజ్, సత్యనారాయణ, ప్రకాష్, మహేష్, సంపత్, శశాంక్, చందు, ఆలయ కమిటీ సభ్యులు శిరీష, పవన్, సత్యనారాయణ, రేణుక, శ్రీనాథ్ స్థానిక నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా మోర్చా ఆధ్వర్యంలో భారీ ధర్నా

**మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ డా.అంగోమ్చా బిమోల్ అకోయిజం రాజీనామా చేయాలి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ డా. అంగోమ్చా బిమోల్ అకోయిజం వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్ర మహిళా మోర్చా పిలుపు మేరకు, యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కస్తూరి మాధురి చంద్ర ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం, ప్రిన్స్ కార్నర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు.11 మంది విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడిన మణిపూర్ ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజంను వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని మహిళా మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం స్పందించాలని, సదరు ఎంపీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ “రాహుల్ గాంధీ డౌన్ డౌన్”, “నింది తుడిని వెంటనే బహిష్కరించాలి” అంటూ నినాదాలు చేశారు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కల్పించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా మోర్చా నాయకులు స్పష్టం చేశారు. మహిళల గౌరవం, భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని పేర్కొంటూ, బాధిత విద్యార్థినులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జనగాం కవిత , ఫ్లోర్ లీడర్ వంగేటి సుచరిత,కౌన్సిలర్లు భోజిన శారద,యాస్మిన్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి స్వర్ణలత, ఉపాధ్యక్షురాలు మాధవి, మందుల లక్ష్మి,చిత్రలేఖ, కార్యదర్శి సీత మానస,జిల్లా కార్యవర్గ సభ్యురాలు శరాజీ విజయ, మండల,పట్టణ నాయకురాలు ఎంగి ప్రేమలత, భూక్యా మౌనిక, ఆరుట్ల సంగీత, మేడిపల్లి జ్యోతి, ఎషబోయిన లక్ష్మి, అలివేల,పరమేశ్వరి,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖలో విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ కనబరిచి, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, న్యాయస్థానాల్లో నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో విశేష సేవలు అందించిన మొత్తం 120 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా న్యాయవాదన చేసిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ రెడ్డిని, భువనగిరి కోర్టులో ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ ఎస్పీ అభినందించారు అదేవిధంగా బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సంచలనాత్మక హత్య కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీసుల కృషితో పాటు, గుండాల పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ఎస్సీ/ఎస్టీ కేసులో నిందితుడికి శిక్ష పడేలా న్యాయపరంగా కృషి చేసిన నల్గొండ ఎస్సీ/ఎస్టీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ దర్శనం నర్సింహను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు, వివిధ సైబర్ నేరాలను ఛేదించడంలో చురుకైన పాత్ర పోషించి బాధితులకు న్యాయం అందించేందుకు కృషి చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, వృత్తి నైపుణ్యం కనబరిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అభినందనలకు అర్హులు. నేరస్తులకు శిక్షలు పడేలా సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్టమైన న్యాయవాదన ఎంతో కీలకం. ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేసే సిబ్బంది సేవలను గుర్తించి ప్రోత్సహించడం పోలీస్ శాఖ బాధ్యత. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలి” అని సూచించారు.

## ముహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శప్రాయం



**ముద్ర, దేవరకొండ:** విశ్వ ప్రవక్త ముహమ్మద్ గారు కేవలం ముస్లింల కోసం కాదని సర్వ కోటి జీవరాశులకు ఈ విశ్వానికి ప్రవక్తగా అల్లాహ్ నియమించారని విశ్వ ప్రవక్త ముహమ్మద్ గారి వారి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమనిసదర్ జమీఅత్ ఉలెమా తెలంగాణ రాష్ట్ర నాజిమ్ దారుల్ ఉలూమ్ నల్గొండ, హజ్రత్ మౌలానా షాహ్ సయ్యద్ ఎహ్ సానుద్దీన్ రషాది సాహబ్ తెలిపారు.సోమవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జనప్రియ గార్డెన్ లో జల్సాఏ సీరతున్నబీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం ఏర్పాటు చేసిన జల్సా సభలో మత పెద్దలు ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత చరిత్ర, శాంతి, సహనం, సోదరభావం గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రసంగిస్తూ ప్రస్తుత తరుణంలో మనిషి స్వార్థపూరితమైన నా, నేను, నాకు అనేటువంటి జీవితం కొనసాగిస్తున్నారని, భూలోకం మనిషికి శాశ్వతం కాదని పరలోకం శాశ్వతమని భూలోకంలో చేసిన ప్రతి పనికి పరలోకంలో అల్లాకు జవాబు చెప్పాల్సి ఉంటుందని సదర్ జమీఅత్ ఉలెమా తెలంగాణ నాజిమ్ దారుల్ ఉలూమ్ నల్గొండ, హజ్రత్ మౌలానా షాహ్ సయ్యద్ ఎహ్ సానుద్దీన్ రషాది సాహబ్, ఖతీబ్ ఏ ఈదేన్ ముఫ్తి సయ్యద్ అమ్జద్ అలీ సాహెబ్ ఖాస్మి అన్నారు. సీరతున్నబి జల్సా కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వీరితోపాటు హజ్రత్ మౌలానా ముఫ్తీ అహ్మద్ ఉల్లా నిసార్ సాహబ్ ఖాస్మి నాజీమ్ దారుల్ ఉలూమ్ రశేదియా మెహెదిపట్నం, హజరత్ గౌస్ మొహియుద్దీన్ సాహబ్ సదర్ జమీఅత్ ఉలెమా చింతపల్లి, ముఫ్తి రిజ్వాన్ ఖాస్మి, మొహమ్మద్ నజీరుద్దీన్ మౌలానా ఖాస్మిలు ముఖ్య అతిథులుగా పాల్గొని వారి అమూల్యమైన ప్రసంగాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సమాజాన్ని అనేక చెడు రుగ్మతలు పట్టిపీడిస్తున్నాయని, వీటిని నిర్మూలించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా దైవ విశ్వాసులపై ఈ బాధ్యత మరింత ఎక్కువగా ఉందన్నారు. చావు పుట్టుకల మధ్యన ఉన్న జీవితం ఒక పరీక్షలు వంటిదని దీనిపైనే సాఫల్య వైఫల్యాలపై ఆధారపడి ఉంటాయని అన్నారు. అనంతరం అతిథులకు శాలువాలతో సత్కరించి వారి దువాను పొందారు. ఈ జల్సాలో మహిళలు, యువకులు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ జల్సా కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కమిటీ అధ్యక్షులు ధన్యవాదాలు తెలిపారు. జల్సాఏ సీరతున్నబీ కార్యక్రమానికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అజ్మీరా రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ఖతీబులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555